Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 199 మేడ్చల్ మల్కాజ్‌గిరి 9 ఆగస్టు 2023 బుధవారం పేజీలు : 4

## దిగి వస్తున్న టమోటా ధరలు.. కిలో ఎంతంటే..

వినియోగదారులను నెలరోజులుగా గజగజలాడించిన టమోటా ధరలు ఎట్టకేలకు దిగి వస్తున్నాయి. టమోటాలు ఎక్కువగా పండించే కోలారు, చిక్కబళ్లాపుర జిల్లాల ఏపీఎంసీ మార్కెట్లకు మూడు రోజులుగా టమోటా భారీగా తరలిస్తుండడమే ఇందుకు కారణం. 15 కిలోల టమోటా బాక్స్ ధర వెయ్యి రూపాయలకు పైగా తగ్గింది.

ఫలితంగా రిటైల్ మార్కెట్‌లో మూడు రోజుల క్రితం వరకు కిలో రూ.120పై చిలుకు పలికిన టమోటా ధర ప్రస్తుతం రూ.80-90 మధ్య ఉంది. అయితే నాణ్యమైన టమోటా ధర ఇంకా రూ.100కుపైగానే ఉండడం గమనార్హం. మరో వారం రోజుల్లో మార్కెట్‌కు మరింత టమోటా పంట తరలిరావచ్చునని అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన టమోటా ధర మరింత తగ్గే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు వెల్లడించాయి.

# మంచి చేసే ప్రభుత్వాన్ని ప్రజలే కాపాడుకుంటారు!

## ఓట్ల కోసం మందు పోయను.. పైసలు పంచను.. మంత్రి కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

రాజన్న సిరిసిల్ల : ఓట్ల కోసం నా జీవితంలో మందు పోయలేదు.. పైసలు పంచలేదు. వచ్చే ఎన్నికల్లోనూ మందు పోయించను.. పైసలు పంచను. మీ దయ ఉంటే మళ్లీ గెలుస్తా.. లేకపోతే ఇంట్లో కూర్చుంటాను అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్‌లో బీసీ బంధు పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఓట్ల కోసం విపక్ష నేతలు వచ్చినప్పుడు ప్రజలు నిలదీయాలి. 50 ఏండ్లుగా చేయలేని వారు ఇప్పుడేం చేస్తారని నిలదీయాలి. ఓట్ల కోసం వచ్చినప్పుడు ప్రజలు చైతన్యం ప్రదర్శించాలి. పని చేసే ప్రభుత్వాలను ప్రజలు కాపాడుకోవాలి. ఓట్ల కోసం మందు పోయించి, పైసలు పంచేవారిని నమ్మొద్దు. ఓట్ల కోసం నా జీవితంలో మందు పోయలేదు.. పైసలు పంచలేదు. వచ్చే ఎన్నికల్లోనూ మందు పోయించను.. పైసలు పంచను. మీ దయ ఉంటే మళ్లీ గెలుస్తా.. లేకపోతే ఇంట్లో కూర్చుంటాను. మందు పోయించి.. పైసలు పంచే చిల్లర రాజకీయం చేయను. ప్రజలందరికీ అండగా ఉండే బాధ్యత నాది. కేసీఆర్ సీఎంగా ఉన్నంత వరకు రాష్ట్రానికి డోకా లేదు. సెప్టెంబర్‌లో సిరిసిల్లలో మెడికల్ కాలేజీని సీఎం ప్రారంభిస్తారని కేటీఆర్ తెలిపారు.

**సీఎం కేసీఆర్ పాలన సంక్షేమానికి స్వర్ణయుగం..** సీఎం కేసీఆర్ పాలన సంక్షేమానికి స్వర్ణయుగంగా మారిందని కేటీఆర్ పేర్కొన్నారు. అట్టడుగు వర్గాల పేదలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. శతాబ్దాలుగా అత్యంత అట్టడుగున ఉన్నది దళితులు. దళితుల అభివృద్ధి కోసం రూ. 10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నాం. బీసీ, ఎంబీసీల్లోని 14 కులవృత్తులు చేసుకునేవారికి రూ. లక్ష సాయం అందిస్తున్నాం. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఈ నెలలో 600 మంది లబ్దిదారులకు రూ. లక్ష చొప్పున సాయం చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి నెల నియోజకవర్గానికి 300 మందికి రూ. లక్ష చొప్పున సాయం ఇస్తామన్నారు. జిల్లాలో దరఖాస్తు చేసుకున్న 10 వేల మందికి లక్ష సాయం తప్పకుండా అందించి తీరుతాం. దళితులు, బీసీలకు అందిస్తున్న మాదిరిగానే మైనార్టీలకు కూడా రూ. లక్ష ఆర్థిక సాయం త్వరలోనే అందజేస్తామని కేటీఆర్ తెలిపారు. ప్రభుత్వం ఇస్తున్న సాయం తిరిగి కట్టాల్సిన అవసరం లేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

**కడుపులో ఉన్న బిడ్డ నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు..** బిడ్డ కడుపులో పడ్డ దగ్గర నుంచి మొదలుకుంటే.. వృద్ధుల వరకు ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని కేటీఆర్ తెలిపారు. పేదల మీద కేసీఆర్‌కు ఉన్న ప్రేమ ఇతరులకు ఎవ్వరికీ లేదన్నారు. ప్రతి పథకం లబ్దిదారులకు నేరుగా అందుతుంది. ఎవరూ అడక్కున్నా.. ప్రతిపక్షాలు డిమాండ్ చేయకున్నా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. మంచి చేసే ప్రభుత్వాన్ని ప్రజలు కాపాడుకుంటారని సీఎం కేసీఆర్ చెప్పారు. భర్త చనిపోతే భార్య పేరు మీదికి ఆసరా పెన్షన్ వెంటనే మార్పు చేయాలి. గృహలక్ష్మి పథకం రూ. 3 లక్షలు ఆర్థిక సాయం అందిస్తాం అని కేటీఆర్ పేర్కొన్నారు.



## రేషన్ డీలర్లకు తెలంగాణ సర్కార్ తీపికబురు

హైదరాబాద్: రేషన్ డీలర్లకు తెలంగాణ ప్రభుత్వంతీపికబురును అందించింది. రాష్ట్రంలోని 17,227 మంది రేషన్ డీలర్ల కమీషన్‌ను మెట్రిక్ టన్నుకు రూ.1400కు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో గతకొద్దిరోజులుగా తమ సమస్యలపై రేషన్ డీలర్లు పోరాడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు రేషన్ డీలర్ల సంఘాలతో మంగళవారం సచివాలయంలో మంత్రులు హరీష్ రావు, గంగుల కమలాకర్ నిర్వహించిన చర్చలు సఫలమయ్యాయి. రేషన్ డీలర్ల కమీషన్‌ను ఏకంగా ఏడు రెట్లు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ఏర్పాటు నుంచి రూ.200లుగా ఉన్న కమీషన్ రూ.1400కు పెంచుతూ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వం ఏటా అదనంగా రూ.139 కోట్లు కేటాయించనుంది. అలాగే కరోనాలో చనిపోయిన 100 మంది డీలర్ల వారసులకు షాపులను కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. బీమా, వేబ్రిడ్జిల ఏర్పాటు, డీలర్ రెన్యూవల్ ఐదేళ్లకు పెంపు, రేషన్ భవన్, అంత్యక్రియల సాయం తదితర 13 ప్రధాన అంశాలకు ప్రభుత్వం పరిష్కారం చూపించింది. పేదల సంక్షేమం, రేషన్ డీలర్ల సంక్షేమంలో తెలంగాణ తిరుగులేదని మరోసారి నిరూపించింది.

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సొంతంగా 91 లక్షల పేదలకు ఆహార ధాన్యాల సరఫరా చేస్తోంది. కేంద్రం కేటాయింపులు పెంచకున్నప్పటికీ వాటిని తెలంగాణ సర్కార్ అందిస్తోంది. కమీషన్‌ను పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేస్తూ.. ధన్యవాదాలు తెలియజేసింది.

## జహీర్‌కు ఐజేయూ, టీయూడబ్ల్యూజే నివాళి

హైదరాబాద్ : నిన్న రాత్రి హఠాత్తుగా మృతి చెందిన మానవతావాది, సుప్రసిద్ధ పాత్రికేయులు, సియాసత్ ఉర్దూ దినపత్రిక మేనేజింగ్ ఎడిటర్ జహీర్ అలీ ఖాన్ అంత్యక్రియలు ఇవాళ తెల్లవారుజామున నాంపల్లిలో జరిగాయి. ఈ అంతిమయాత్రలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విరాహత్ అలీ, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎం.ఏ.మాజీద్, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్(హెచ్.యు.జె) కార్యదర్శి షౌకత్ హమీద్, మాజీ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, తెలంగాణ జనసమితి పార్టీ(టీజేఎస్) అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం, వీక్షణం ఎడిటర్ ఎన్. వేణుగోపాల్, జనం సాక్షి సంపాదకులు రెహ్మాన్ తదితరులు హాజరై జహీర్ అలీ ఖాన్ కు నివాళి అర్పించారు. లౌకికవిలువల పరిరక్షణే ధ్యేయంగా నిరంతరం పోరాడుతూ, సామాజిక ఉద్యమాల్లో ముందుండే మానవతావాది.. సియాసత్ ఉర్దూ దినపత్రిక మేనేజింగ్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్(63) సోమవారం మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం గద్దర్ అంతిమయాత్రలో పాల్గొన్న ఆయన.. కార్డియాక్ అరెస్టుతో హఠాన్మరణం చెందారు.


తనకు ఎంతో ఆప్తుడైన గద్దర్ మరణంతో తీవ్ర భావోద్వేగానికి గురైన జహీరుద్దీన్.. తొలుత అపోలో ఆస్పత్రికి వెళ్లి ఆయన భౌతికకాయాన్ని చూశారు. సోమవారమంతా ఎల్‌బీ స్టేడియంలోనే ఉండిపోయారు. గద్దర్ పార్థివ దేహాన్ని తరలిస్తున్న వాహనంలోనే ఆయన ఇంటివద్దకు చేరుకున్నారు. ఆ తర్వాత అక్కడి నుంచి.. మహాబోధి స్కూల్ ప్రాంతాన్ని పరిశీలించడానికి వెళ్లారు. అప్పటికి సాయంత్రం ఆరున్నర గంటలు కావొస్తోంది. ఇంతలో ఆయనకు ఒక ఫోన్ కాల్ రావడంతో స్కూల్ ప్రాంగణం




నుంచి బయటకు వచ్చారు. ఫోన్ మాట్లాడుతున్న క్రమంలోనే శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతూ ఆయన కుప్పకూలిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

ఆయన వాంతులు చేసుకుంటుండడంతో అక్కడున్నవారు సీపీఆర్ చేసి, ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి తీసుకొచ్చేటప్పటికే ఆయన కార్డియాక్ అరెస్టుతో తుది శ్వాస విడిచినట్లు వైద్యులు ప్రకటించారు.

# కేంద్రం కూడా 'అప్పుల కుప్పే'




## ఈ ఏడాది మార్చి నాటికి ఎన్ని లక్షల కోట్లంటే

'అప్పులు చేస్తున్న రాష్ట్రాలకు నేనొకటే చెప్పదలుచుకున్నా. మీ పరిస్థితి చూస్తుంటే.. శ్రీలంక, పాకిస్థాన్ మాదిరిగా మారే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా కట్టడి చేసుకోండి. ఉచితాలు మానేయండి. అప్పులు నియంత్రించండి"- ఈ ఏడాది వార్షిక బడ్జెట్(2023-24) ను పార్లమెంటులో ప్రవేశ పెట్టిన సమయంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన హెచ్చరిక. అప్పట్లో ఏపీ సహా.. బీజేపీయేతర రాష్ట్రాలను ఉద్దేశించి ఆమె ఈ వ్యాఖ్యలు చేసినట్టు ప్రచారంలోకి వచ్చింది. కట్ చేస్తే.. ఈ అప్పుల విషయంలో కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కారు కూడా.. అప్పులు విషయంలో తక్కువేమీ కాదనే అంశం.. తాజాగా నిండు పార్లమెంటులో కేంద్రం చెప్పిన లెక్కలను బట్టి తెలుస్తోంది. ఈ ఏడాది మార్చి 31(నెలాఖరు) నాటికి కేంద్రం అప్పులు.. 156 లక్షల కోట్ల రూపాయలకుపైగానే ఉన్నాయి. ఇది.. దేశ జీడీపీ(తలసరి ఆదాయం)లో 57.1 శాతానికి చేరాయి. ఇక, మోడీ సర్కారు పగ్గాలు చేపట్టే నాటికి.. అంటే 2014 మార్చి 31లో ఈ అప్పులు జీడీపీలో 52.4 శాతం ఉన్నాయి. అంటే.. అప్పటికి ఉన్న మొత్తం అప్పు 58 లక్షల కోట్ల రూపాయలు.

**మోడీ ఒక్కరే 98 లక్షల కోట్ల అప్పు...** మోడీ హయాంలో అప్పులు ర్యాకెట్ వేగాన్ని మించిన వేగంతో పుంజుకున్నాయనేది పార్లమెంటుకు తాజాగా వెల్లడించిన ప్రభుత్వ లెక్కలే స్పష్టం చేస్తున్నాయి. 2014లో 58.6 లక్షల కోట్ల రూపాయల అప్పు ఉండగా, అప్పటి నుంచి ఇప్పటి వరకు అంటే.. 2014-2023(9 ఏళ్లు) నాటికి ఈ అప్పులు 156 లక్షల కోట్లకు చేరాయి. అంటే.. ఈ 9 ఏళ్ల కాలంలో మోడీ ప్రభుత్వం దాదాపు 98 లక్షల కోట్ల మేరకు అప్పులు చేసిందన్న మాట. ఈ విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి పార్లమెంటుకు వివరించారు.

**ఇదీ.. అప్పుల లెక్క..** 2014 నుంచి 2023 మధ్యకాలంలో మొత్తం రుణాలు రూ.58.6 లక్షల కోట్ల నుంచి రూ.155.6 లక్షల కోట్లకు చేరాయి. 2019-20 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి కేంద్ర ప్రభుత్వ అప్పులు రూ.105.1 లక్షల కోట్లు. జీడీపీలో ఇది 52.4% 2020-21 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి అప్పు రూ.121.9 లక్షల కోట్లు. జీడీపీలో 61.5%. విదేశీ అప్పు.. 2014 మార్చి 31 నుంచి 2023 మార్చి 31 మధ్యకాలంలో రూ.3,74,484 కోట్ల నుంచి రూ.7,48,895 కోట్లకు చేరింది.

# సంపాదకీయం

## బీజేపీ దువ్వుడు.. పార్టీలను పిచ్చెక్కిస్తోందే..!

కేంద్రంలోని బీజేపీ అండ కోసం.. ఏపీ లోని ప్రధాన పార్టీలైన వైసీపీ, టీడీపీలు ఎంతో ప్రయత్నం చేస్తున్నాయి. పొత్తుల కోసం.. టీడీపీ తెర చాటు, బయట కూడా.. బీజేపీ ని తనవైపు తిప్పుకొనేందుకు ప్రయత్నిస్తోంది. ఇక, వైసీపీ ప్రభుత్వం కూడా.. బీజేపీకి అన్ని విధాలా సహకారం అందిస్తూనే ఉంది. అయితే.. ఇప్పుడు బీజేపీ ఎలా వ్యవహరిస్తోందనేదే ఆసక్తిగా మారింది. ఇటు.. వైసీపీకి, అటు టీడీపీకి కూడా.. పిచ్చెక్కించేలా చేస్తోందని అంటున్నారు పరిశీలకులు. పొత్తుల విషయాన్ని తేల్చకుండా టీడీపీ ని తికమక పడేతున్న బీజేపీ.. వైసీపీకి చేరువగా ఉన్నట్టు కనిపిస్తోంది. దీనిని గమనించిన వారు ఇక, బీజేపీ.. టీడీపీతో చేతులు కలపదని వ్యాఖ్యానిస్తున్నారు. ఒంటరిగానే పోరాటం చేస్తారని అంటున్నారు. ఇది.. వైసీపీ లో ఖుషీ ని నింపుతోంది. ఇదిలావుంటే.. బీజేపీ వైసీపీకి చేరువ అవుతున్నట్టుగానే వ్యవహరిస్తోంది. కేంద్రం నుంచి వచ్చే నిధుల ను వెంట వెంటనే ఇస్తోంది. తెలంగాణ నుంచి రావాల్సిన బకాయిల ను కూడా నేరుగా ఇస్తామని ప్రకటించింది. ఇది వైసీపీకి , బీజేపీ చేస్తున్న మేలు. నిజమే. దీంతో వైసీపీ చెప్పినట్టే బీజేపీ నడుస్తుందని.. అందరూ భావిస్తున్నారు. వైసీపీ నాయకులు కూడా ఇదే లెక్కలు వేసుకుంటున్నారు. కట్ చేస్తే.. ఇంతలోనే టీడీపీకి అనుకూలంగా ఉన్నట్టుగా బీజేపీ వ్యవహరిస్తోంది. టీడీపీ కీలక నాయకులు చంద్రబాబు, నారా లోకేష్‌ల కు భద్రత ఎలా ఉందంటూ సర్కారు ను ప్రశ్నిస్తోంది. దీంతో టీడీపీ నేతలు ఖుషీ అవుతున్నారు. తమ నాయకుల గురించి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పట్టించుకుంటోందంటే..తమవైపు అడుగులు వేస్తున్నట్టే కదా! అని కనకమేడల రవీంద్రకుమార్ వంటి ఎంపీలు వ్యాఖ్యానిస్తున్నారు. ఇంకోవైపు.. వైసీపీ నాయకులను తమవైపు తిప్పుకోవడంలో బీజేపీ సక్సెస్ అయినందున.. వారంతా వైసీపీకే దన్నుగా ఉంటారని వైసీపీ భావిస్తోంది. మొత్తం ఎటూ తేలకుండా.. అంటే.. కట్టె విరగకుండా.. పాము చావకుండా అన్నట్టైపులో వ్యవహరిస్తూ.. బీజేపీ పిచ్చెక్కిస్తోందని అంటున్నారు పరిశీలకులు.

## విద్యుత్తు శాఖలో సమ్మె సైరన్




ఖమ్మం : విద్యుత్తు శాఖలో ఆర్టిజన్ కార్మికులు సమ్మెకు పిలుపునివ్వడంతో టెన్షన్ ప్రారంభమైంది. తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం(25వ తేదీ) నుంచి సమ్మెకు పిలుపునిచ్చారు. తక్కువ వేతనాలకు ఏళ్ల తరబడి పని చేస్తున్న తమపై యాజమాన్యాలు ఎస్మా చట్టం ప్రయోగిస్తామని, ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నాయని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టిజన్లు విద్యుత్తు సంస్థలైన ఉత్పత్తి (జెన్కో), సరఫరా (ట్రాన్స్‌కో), పంపిణీ(ఎన్పీడీసీఎల్)లో కంప్యూటర్ ఆపరేటర్లు, సబ్‌స్టేషన్ ఆపరేటర్లు, అటెండర్లు, వాచ్‌మన్లు వంటి వివిధ పోస్టుల్లో తాత్కాలిక పద్ధతిపై నియమితులై ఏళ్ల తరబడి పని చేస్తున్న వారు ఆర్టిజన్లుగా గుర్తింపు పొందారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఈ సంస్థల్లో సుమారు 2,400 మంది పని చేస్తున్నట్లు తెలుస్తోంది.

డిమాండ్లు

ఇటీవల ప్రకటించిన వేతన సవరణ(పీఆర్సీ)లో ఆర్టిజన్ల వేతనం 7 శాతం పెంపునకు ప్రభుత్వం అంగీకరించింది. తమకు దీనివల్ల కేవలం రూ.3 వేలకు మించి ప్రయోజనం కలగడం లేదని వారు వాపోతున్నారు. 51 శాతం ఫిట్మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే ప్రభుత్వం పర్మనెంట్ చేశామని శాసనసభలో ప్రకటించిన విధంగా తమకు శాశ్వత ఉద్యోగులతోపాటు అలవెన్సులు అందడం లేదని, తమకు ఈ వసతులన్నీ కల్పించాలని కోరుతున్నారు.

ఎస్మా చట్టం...

ఆర్టిజన్లు 25 నుంచి సమ్మెకు పిలుపునివ్వడంతో ప్రభుత్వం ఎస్మా చట్టం ప్రయోగించింది. సమ్మెను నిషేధిస్తున్నామని ప్రతి ఒక్కరూ విధులకు హాజరు కావాలని ఆదేశించింది. 25న ఉదయం 8 గంటలకు ప్రతి ఒక్కరూ తాము పనిచేసే ప్రాంతంలో హాజరు కావాలని, లేకుంటే సమ్మె చేస్తున్నట్లుగా గుర్తించి విధుల నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారని ఆర్టిజన్లు వాపోతున్నారు. అలాగే కొందరు నాయకులను బైండోవర్ కేసులతో వేధిస్తున్నారని ఆరోపించారు. పీఆర్సీలో మేలు జరిగిన ఉద్యోగ సంఘాలు వారికి పూర్తిస్థాయిలో మద్దతు ఇవ్వడంలేదు. అయినా కొందరు సమ్మెలో పాల్గొనాలని నిర్ణయించినట్లు తెలుస్తుండటంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. దీనిపై ఆర్టిజన్ల సంఘ నాయకులతో చర్చించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.'సమ్మెలు నిషేధం'- సురేందర్, ఎస్ఈ, ఎన్పీడీసీఎల్, ఖమ్మం అత్యవసర సేవల విభాగమైన విద్యుత్తు సంస్థలో సమ్మెకు దిగడం ఎస్మా-1971 చట్టరీత్యా నేరమని ఎన్పీడీసీఎల్ ఛీఫ్ విజిలెన్సు అధికారి బి.జనార్దన్ తెలిపారు. విద్యుత్తు సంస్థల్లో సమ్మెలను నిషేధించామన్నారు. ఎవరైనా సమ్మెకు వెళితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యాజమాన్యం సానుకూలంగా ఉన్నప్పటికీ కొందరు సమ్మెకు వెళ్తుండటంతో సంస్థ పరిధిలోని వరంగల్, జనగామ, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల పరిధిలో కొందరు ఆర్టిజన్ ఉద్యోగులను అదుపులోకి తీసుకున్నామని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

ఆర్టిజన్ల సమ్మెపై యాజమాన్యం వారితో చర్చిస్తోంది. కార్మికులు సైతం సమ్మెకు వెళ్లేందుకు సుముఖంగా లేరు. సమ్మె ప్రభావం విద్యుత్తు సరఫరాపై లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం.

## చిట్టి ఆలోచన.. గట్టి ఆవిష్కరణ



పెద్దపల్లి: 'చెట్టుపై నుంచి యాపిల్ పండు పడ్డప్పుడు న్యూటన్‌కు తట్టింది.. ఆర్కిమిడీస్‌కు నీటి తొట్టి వద్ద పుట్టింది..' ఆలోచన ఎప్పుడైనా కలగొచ్చు.. ఉపాయం ఎవరికైనా రావొచ్చు.. బాలలూ.. మీరే భావి శాస్త్రవేత్తలు. ఖాళీ సమయం వృథా చేయకుండా ఆలోచనలను ఆవిష్కరణల వైపు మళ్లించుకునేందుకు ఇదే తరుణం. మేధస్సును పరీక్షించుకునేందుకు ఆన్‌లైన్‌లో వివిధ రకాల విజ్ఞాన పోటీలు అందుబాటులో ఉన్నాయి. చిన్నారుల ఆలోచనలకు పదును పెట్టి, వారిని ప్రోత్సహించే వారు లేక జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో రాణించలేకపోతున్నారు. మొక్కుబడిగా పరిశోధన నమూనాలు రూపొందించడంతో ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదు. వేసవి సెలవుల్లో ఇంటి వద్దనే సాధన ప్రారంభిస్తే సత్ఫలితం వస్తుంది. ఇక ఆలస్యం ఎందుకు. శాస్త్రవేత్తగా ఎదిగే మార్గాలు, ఆన్‌లైన్ వైజ్ఞానిక ప్రదర్శనలు, నిపుణుల ప్రోత్సాహం తదితర అంశాలను తెలిపే కథనం.

నైపుణ్య వికాసానికి పదును ఇలా

లి పరిశోధన నమూనాను హడావుడిగా నమోదు చేసుకొని ప్రదర్శనలో పాల్గొంటున్నారు.

లి సైన్స్ ఉపాధ్యాయుల సలహాలతో నిత్యం సాధన చేస్తుండాలి.

లి విద్యార్థుల మేధకు పదును పెట్టేందుకు ఉద్దేశించిన వైజ్ఞానిక పోటీల్లో ఆశించిన ప్రతిభ కనిపించడం లేదు.

లి వినూత్న రీతిలో ఆవిష్కరణలు రూపుదిద్దుకోవడం లేదు. పిల్లల్లో జిజ్ఞాస కొరవడింది.

లి దీంతో పైసా ఖర్చు లేకుండానే బహుళ ప్రయోజనం చేకూరేలా ఫలితాలు వస్తాయి.

పరిసరాలే పరిశోధనకు బీజం

మన చుట్టూ ఉన్న పరిసరాలు, నిత్య జీవితంలో ఎదుర్కొనే సమస్యలే పరిశోధనలకు మూలాలు. గుర్తించిన సమస్యలను విశ్లేషించి వాటి పరిష్కారానికి తగిన ఆలోచనలు చేసినపుడే ఆవిష్కరణలు రూపుదిద్దుకుంటాయి. సమకాలీన అంశాలపై అవగాహన పెంచుకుంటే సృజనాత్మకత వెల్లివిరుస్తుంది. చిట్టి బుర్రలో మెరిసిన ఆలోచనకు నైపుణ్యం జోడిస్తే ప్రయోగాలకు ఫలితం వస్తుంది.

ఆన్‌లైన్‌లో విజ్ఞాన ప్రదర్శనలు

విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఊతమిస్తున్నాయి. కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆధీనంలోని సీఎస్ఐఆర్(కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ ఇండస్ట్రియల్ రీసెర్చి) జాతీయ స్థాయిలో ఇన్నోవేషన్ అవార్డు స్కూల్ చిల్డ్రన్ పేరిట వైజ్ఞానిక పోటీలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ప్రతి సంవత్సరం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జాతీయ స్థాయి ప్రదర్శనలో అత్యుత్తమ నమూనాలకు నగదు పారితోషికం అందిస్తున్నారు. ఈ ఏడాదికి సంబంధించి నోటిఫికేషన్ రావాల్సి ఉంది.

ఈ బుడతలు.. ధరణి నేస్తాలు

మితిమీరిన క్రిమిసంహారక మందుల వినియోగంతో నేలలో పోషకాలు తగ్గి పంట దిగుబడి తగ్గుతుందన్న కన్నవారి మాటలే ఆ విద్యార్థులను పరిశోధనల వైపు పురిగొల్పాయి. తమ పెద్దల కష్టాలకు కొంత పరిష్కారం చూపేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేట పాఠశాల విద్యార్థులు మట్టి నాణ్యత పరికరాన్ని కనుగొన్నారు. వారి పొలంతో చుట్టుపక్కల రైతులకు చెందిన భూసారాన్ని పరీక్షించి అవగాహన కల్పించారు.


శభాష్.. హర్షితపెద్దపల్లి జిల్లా రామగిరి మండలం చందనాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని దాసరి హర్షిత తన ఆలోచనతో ఏకంగా దేశ ప్రథమ పౌరురాలి ఎదుట ప్రదర్శన ఇవ్వగలిగింది. ప్రమాదాలతో పాటు పొగ, దుమ్ము నుంచి రక్షణ కవచంగా నిలిచే 'మల్టీ పర్పస్ హెల్మెట్(బహుళ ప్రయోజన శిరస్త్రాణం) రూపొందించిన ఆమెను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభినందించారు. వాయు కాలుష్యం నుంచి కాపాడుకునే ఆవిష్కరణ వినూత్నం అంటూ కితాబిచ్చారు.

ఆసక్తి నింపి.. ఆలోచనలు పెంచి..

'అవసరం నుంచి ఆలోచన.. ఆ ఆలోచన నుంచి ఆవిష్కరణ' అనే సిద్ధాంతాన్ని బోధిస్తూ బాల శాస్త్రవేత్తలను తీర్చిదిద్దుతున్నారు రాజన్నసిరిసిల్ల జిల్లా దమ్మన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాల విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయుడు సంపత్‌కుమార్. వేసవిలో ఆన్‌లైన్‌లో పరిశోధనలపై ఆయన మెలకువలు అందిస్తున్నారు. వినూత్నంగా ప్రయోగాలు చేసేందుకు విద్యార్థులకు తర్ఫీదునిస్తున్నారు. రామగిరి మండలం చందనాపూర్, దమ్మన్నపేట విద్యార్థులు అయిదు సార్లు అంతర్జాతీయ, 11 సార్లు జాతీయ ప్రదర్శనల్లో సత్తా చాటడంలో సంపత్‌కుమార్ కీలక పాత్ర పోషించారు. ఆసక్తి ఉన్న పిల్లలు ఆయన సలహాలు, సూచనల కోసం 95504 14416 నెంబరులో సంప్రదించవచ్చు.

## కంటి వెలుగు కేంద్రంలోకి కోతులు!

భూపాలపల్లి : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'కంటి వెలుగు' కార్యక్రమ శిబిరం గదిలోకి వానరాలు చొరబడి బీభత్సం సృష్టించిన సంఘటన మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం పడమటిగూడెం గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో వెలుగు జూసింది. ఈ విషయం స్థానికంగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామంలో పడమటిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కొంతమందిని పరీక్షించి శని, ఆదివారాల్లో సెలవు నేపథ్యంలో వైద్యులు, సిబ్బంది గదికి తాళం వేసి వెళ్లారు. ఆ సమయంలో కిటికీలకు గడియపెట్టడం విస్మరించారు. సెలవు రోజుల్లో కిటికీల నుంచి వానరాలు లోనికి ప్రవేశించి కంటి అద్దాల పెట్టెలను చిందరవందర చేశాయి. వైద్యులు పరీక్షించే పరికరాలను పడవేశాయి. వైద్యాధికారులు, సిబ్బందికి సమాచారమిచ్చినా ఎవరూ పట్టించుకోలేదని స్థానికులు తెలిపారు. విధులకు వచ్చిన వైద్యులు, సిబ్బంది గది తాళాలు తీసి బిత్తరపోయారు. సమాచారం బయటకు పొక్కకుండా వెంటనే శుభ్రం చేయించి సామగ్రి సరిచేశారు. ఈ విషయంపై దంతాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



క్లస్టర్ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో) బాలాజీని వివరణ కోరగా గాలిదుమారానికి ఓ కిటికీ తలుపు తెరుచుకోవడంతో కోతులు లోనికి వెళ్లాయన్నారు. ఎలాంటి నష్టం వాటిల్లలేదని, శిబిరం యధావిధిగా కొనసాగిందన్నారు.

## దగ్గరైన దూరవిద్య!

జనగామ : ఆర్థిక స్తోమత లేక కళాశాలలకు వెళ్లి చదువుకోలేని వారికి, డిగ్రీ పట్టా లేక పదోన్నతి పొందలేకపోతున్న వారికి, ఇతర కారణాలతో కళాశాలలకు వెళ్లలేని విద్యార్థులకు జనగామ ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ కేంద్రం దారి చూపుతోంది. దూరవిద్య విధానంలో డిగ్రీ చదివిన వారికి రెగ్యులర్ డిగ్రీతో సమానంగా అవకాశాలు ఉండడంతో ఏటా ఇందులో చేరుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ప్రభుత్వ శాఖలు, ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాల కల్పనకు దూరవిద్య ధ్రువీకరణ పత్రాలను ఆమోదిస్తుండడంతో చాలా మంది దూరవిద్యపై మొగ్గు చూపుతున్నారు.

మూడు దశాబ్దాల క్రితమే స్థాపన !

మూడు దశాబ్దాల క్రితం నుంచి దూరవిద్యకు ఆదరణ ఎక్కువే. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థులకు విద్య అందించాలనే సంకల్పంతో 1991లో జనగామలో దూరవిద్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పట్లో 30 నుంచి 50 వరకు ఉన్న ప్రవేశాల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇప్పటి వరకు వందలాది మంది పట్టభద్రులు కాగా పలువురు ఉద్యోగాలు సాధించినట్లు స్థానిక అధ్యయన కేంద్రం అధికారులు తెలిపారు. గతేడాది 285 మంది చేరగా ఈ ఏడాది 300 మందికి పైగా చేరుతారని భావిస్తున్నారు. అప్పటి ఎకనామిక్స్ అధ్యాపకుడు ఎస్.సత్యనారాయణ తొలి కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా ప్రస్తుత కోఆర్డినేటర్‌గా అనగాని శ్రీనివాస్ వ్యవహరిస్తున్నారు.

అర్హులు వీరే..!యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ కొన్ని మార్పులతో దూరవిద్యలో దరఖాస్తులను స్వీకరిస్తోంది. దూరవిద్యలో ప్రవేశం పొందాలంటే 18 ఏళ్లు నిండి, లేదా పదో తరగతి, ఇంటర్ అనుత్తీర్ణులై, మధ్యలో చదువు ఆపేసిన వారు అర్హులు. 2017-18 విద్యాసంవత్స



రంలో ఇంటర్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన వారిని దూర డిగ్రీలోకి తీసుకోవాలన్న నిబంధనలు అమలు కానున్నాయి. దూరవిద్యలో పదో తరగతి, ఇంటర్ అనుత్తీర్ణులైన వారిని ఇందుకు అనర్హులుగా ప్రకటించారు. రెగ్యులర్ విధానంలోనైనా, దూరవిద్యలోనైనా పాలిటెక్నిక్, ఇంటర్ లేదా ఏదైనా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులైన వారే ఇందుకు అర్హులని జనగామ అధ్యయన కేంద్రం నిర్వాహకులు చెబుతున్నారు.

ఉద్యోగావకాశాలు మెండు..

రెగ్యులర్ డిగ్రీ సాధ్యపడని వారు దూరవిద్యను అందిపుచ్చుకొని సద్వినియోగం చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఏ ఉద్యోగానికైనా డిగ్రీ ఉత్తీర్ణతను తప్పనిసరి చేస్తుండడంతో పది, ఇంటర్‌లో ఉత్తీర్ణులై ప్రైవేటులో ఉద్యోగాలు చేస్తున్న వారు సైతం దూరవిద్య ద్వారా డిగ్రీ పట్టా పొందుతున్నారు. ఉన్నత ఉద్యోగాల కోసం వస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. పది, ఇంటర్‌తో ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడిన సైతం దూరవిద్యలో డిగ్రీ పొంది పదోన్నతి పొందుతున్నారు.

అవకాశాన్ని వినియోగించుకోవాలి-అనగాని శ్రీనివాస్, స్టడీ సెంటర్ కోఆర్డినేటర్, జనగామ

రెగ్యులర్ డిగ్రీతో సమానంగా దూరవిద్యకూ అవకాశాలు ఉన్నాయి. ఇంటర్, పాలిటెక్నిక్, ఇతర తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే అర్హులు. దూరవిద్యలో డిగ్రీ పూర్తి చేసిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత పొందే అవకాశం ఉంటుంది.

## నిర్వహణ ప్రశ్నార్థకం.. అవస్థలు యథాతథం!

సూర్యాపేట : గ్రామీణ ప్రాంతాల్లో దహన సంస్కారాలు నిర్వహించాలంటే వ్యవసాయ భూములు ఉన్న వారు వారి సొంత స్థలంలో.. లేని వారు చెరువులు, కుంటల వెంట చేపట్టాల్సిన పరిస్థితి. వర్షాకాలంలో దహన సంస్కారాలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని వైకుంఠధామాల నిర్మాణాలకు చర్యలు తీసుకొంది. ప్రతి గ్రామం, పురపాలికల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఒక్కోదానికి సుమారు రూ.12.50 లక్షలకు పైగా నిధులు వెచ్చించి నిర్మాణాలు పూర్తి చేశారు. ఏర్పాటు చేసిన తరువాత వాటిని పట్టించుకోకపోవడంతో నిర్వహణ అస్తవ్యస్తంగా తయారవుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వీటి నిర్వహణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అంతిమ యాత్రకు అవస్థలు

జిల్లాలో 475 గ్రామ పంచాయతీలు, 5 పురపాలికలు ఉన్నాయి. స్థలాభావం కారణంగా కొన్ని చోట్ల వైకుంఠధామాలను చెరువులు, కుంటలు ప్రాంతాల్లో నిర్మాణం చేపట్టారు. వర్షాకాలంలో నీరు చేరి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. అంతేకాక వైకుంఠధామాలకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం లేకపోవడంతో దహన సంస్కారాలు నిర్వహించేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. వైకుంఠధామాల చుట్టూ పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు పెరిగి విష సర్పాలకు నిలయంగా మారుతున్నాయి.

మౌలిక వసతులు కరవు

వైకుంఠధామాల్లో విద్యుత్తు, నీటి సౌకర్యం ఇతర మౌలిక వసతులు కల్పించినప్పటికీ నిర్వహణ లేక నిర్వీర్యం అవుతున్నాయి. వైకుంఠధామాలు పలుచోట్ల గ్రామాలకు దూరంగా ఉన్నాయి. దీనికి తోడు కొందరు ఆకతాయిలు వీటిని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకుంటున్నారు. తలుపులు, ఇతర సామగ్రిని తాగిన మత్తులో ధ్వంసం చేస్తున్నారు. వీరి ఆగడాల కారణంగా మరమ్మతుల కోసం అదనంగా నిధులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి.

పర్యవేక్షణ పెంచుతాం: యాదయ్య, డీపీవో, సూర్యాపేట

జిల్లావ్యాప్తంగా నిర్మించిన వైకుంఠధామాల్లో దహన సంస్కారాలు నిర్వహించారు. వీటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. వైకుంఠధామాల సామగ్రి ధ్వంసం కాకుండా ప్రహరీ, రక్షణ కంచె ఏర్పాటుతోపాటు గ్రామ పోలీస్ అధికారి, పంచాయతీ సిబ్బంది పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది. వీటి ప్రవేశద్వారం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ఉపాధి నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపడతాం.

# సేవా కేంద్రం.. ఆదాయం అంతంతమాత్రం

మెట్‌పల్లి : మెట్‌పల్లి మండలం సత్తక్కపల్లిలో గతేడాది రైతు సేవా కేంద్రం ప్రారంభించారు. సుమారు రూ.23 లక్షలతో ట్రాక్టర్, ట్రాలీ, నాటు యంత్రం, రొటోవేటర్, స్ప్రే పంపు, నాగళ్లు తదితర పరికరాలు కొనుగోలు చేశారు. ఇందులో 25 శాతం ఎన్‌ఆర్‌ఎల్‌ఎం నుంచి రాగా, మిగతా 75 శాతం జిల్లా సమాఖ్య నుంచి రుణంగా పొందారు. ఆ తర్వాత రుణాన్ని తీర్చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో చేసిన పనికి రూ.2,75,780 ఆదాయం సమకూరింది. ఇందులో రూ.1,25,077 డ్రైవర్ వేతనం, రూ.1,49,404 డీజిల్, నిర్వహణ ఖర్చులు, రూ.1,200 మరమ్మతులకు వెచ్చించారు. ఇవన్నీ పోను రూ.99 మాత్రమే ఆదాయం మిగిలింది. ఆ తర్వాత డ్రైవర్ మానేయడంతో మూడు నెలలుగా ట్రాక్టర్, పరికరాలు వృథాగానే ఉన్నాయి.

ఫలితమేదీ?సన్న, చిన్నకారు రైతులకు ఆధునిక సాగు యంత్ర పరికరాలు చేరువ చేసి పెట్టుబడి వ్యయం తగ్గించడంతో పాటు మహిళా సంఘాలకు అదనపు ఆదాయం సమకూర్చాలని సెర్ప్ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రాల (కస్టమర్ హైరింగ్ సెంటర్)ను ఏర్పాటు చేశారు. జిల్లాలో 1.74 లక్షల మంది రైతులుండగా, సుమారు 4.34 లక్షల ఎకరాల వరకు సాగు భూములున్నాయి. బహిరంగ మార్కెట్‌లో యంత్రాల అద్దె కంటే సేవా కేంద్రాల్లో కొంత అద్దె తగ్గించి యంత్ర పరికరాలు, విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచితే అన్నదాతలకు సేవతో పాటు మహిళా సంఘాలకు అదనపు ఆదాయ మార్గంగా ఉంటుందని సెర్ప్ అధికారులు భావించారు. దీంతో విడతల వారీగా 17 మండలాల్లో సేవా కేంద్రాలను ఏర్పాటు చేసి పరికరాలను అందుబాటులో ఉంచారు. యూనిట్ విలువలో జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ (ఎన్‌ఆర్‌ఎల్‌ఎం) కింద ప్రభుత్వం 25 శాతం ఇవ్వగా, మిగతా 75 శాతం జిల్లా సమాఖ్య, బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి



కింద రుణంగా తీసుకుని యంత్ర పరికరాలను కొనుగోలు చేసి కేంద్రాలు ప్రారంభించారు. ఆశించిన స్థాయిలో కేంద్రాలు ముందుకు సాగడం లేదు. రైతులు సేవా కేంద్రాల పరికరాల వైపు అంతగా మొగ్గు చూపకపోవడం, ఐకేపీ మండల స్థాయి సిబ్బంది చొరవ చూపకపోవడంతో పలు చోట్ల ఆదాయం అంతంతమాత్రంగానే ఉండి ప్రయోజనం నెరవేరడం లేదు.

దృష్టిసారిస్తేనే మేలు

ఊరూరా ప్రైవేట్ వ్యక్తులకు చెందిన ట్రాక్టర్లు అధిక సంఖ్యలో ఉన్నాయి. దీంతో బహిరంగ మార్కెట్‌లో పోటీ ఉంటుంది. కానీ మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళా రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులకు అవగాహన కల్పించి సేవా కేంద్రాల్లోని పరికరాలు వినియోగించుకునేలా ప్రోత్సహిస్తేనే ప్రయోజనముంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఐకేపీలో గ్రామ, మండల స్థాయి సిబ్బంది ఉండగా, మహిళా సంఘాలు, రైతుల సమావేశాల్లో సేవా కేంద్రాలపై ప్రచారం కల్పించడంపై దృష్టిసారించాల్సిన అవసరముంది. ఉన్నతాధికారులు స్పందించి కింది స్థాయి సిబ్బందికి సలహాలు, సూచనలిచ్చి సేవా కేంద్రాల పనితీరు మెరుగయ్యేలా చూస్తేనే అటు రైతులకు మేలు జరగడమే కాకుండా ఇటు మహిళా సంఘాలకూ అదనపు ఆదాయం వచ్చే అవకాశముంది.

ఇదీ పరిస్థితి జిల్లాలో 17 మండలాల్లో సేవా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు రూ.14,66,656 ఆదాయం సమకూరగా, ఇందులో వివిధ రూపేణా రూ.10,14,179 ఖర్చవడంతో రూ.4,52,477 మిగిలినట్లు తెలుస్తోంది. ఇందులో ఏడు కేంద్రాల్లోనే ఎక్కువ మొత్తంలో ఆదాయం మిగలగా, మిగతా పది కేంద్రాల్లో రూ.7 వేల లోపే ఆదాయం మిగిలింది. కొన్ని కేంద్రాల్లో అవగాహన లోపంతో ఆదాయం, ఖర్చు ఇంచుమించు సమానంగా ఉండడంతో తక్కువ మొత్తంలో ఆదాయం మిగిలినట్లు తెలుస్తోంది.

లక్ష్యం విధిస్తున్నాం- వెంకటేశ్, డీపీఎంజిల్లాలో 17 సేవా కేంద్రాలను ప్రారంభించారు. సేవా కేంద్రాల ద్వారా రైతులకు తక్కువ ధరకు పరికరాలు అందించడంతో పాటు మహిళా సంఘాలకు ఆదాయం సమకూరేలా చూస్తున్నారు. ఎప్పటికప్పుడు సమావేశాలు పెట్టి ఏపీఎంలు, సీసీలకు దిశానిర్దేశం చేస్తున్నారు. ప్రతి నెల రూ.40 వేల ఆదాయం రావాలని లక్ష్యం విధిస్తున్నాం. ఐకేపీ సిబ్బంది క్షేత్రస్థాయిలోకి వెళ్లి రైతులను సేవా కేంద్రం పరికరాలను వినియోగించుకునేలా ప్రోత్సహించాలి. రైతులు సైతం ముందుకు రావాలి.

# 16 ఏళ్లుగా నిరుపయోగం

కరీంనగర్ :కోరుట్ల పట్టణం అంబేడ్కర్‌నగర్‌లోని ప్రధాన రహదారి పక్కన సుమారు 55 ఏళ్ల కిందట నిర్మించిన భవనంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కొనసాగుతుంది. పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు మొత్తం 130 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో 2008లో అప్పటి ప్రజాప్రతినిధులు సుమారు రూ.16 లక్షలు వెచ్చించి ఆదేకాలనీలో ఒక అంతస్తుతో కూడిన నాలుగు గదుల భవనం, మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించారు. తాగునీటి వసతి, మధ్యాహ్న భోజన వంటగది, ప్రహరీ నిర్మించకుండా వదిలేశారు. దీంతో 16 ఏళ్లుగా నూతన భవనం ప్రారంభించకుండా వదిలేశారు. మూడేళ్ల కిందట సర్వశిక్షా అభియాన్ ద్వారా పాఠశాల అభివృద్ధికి రూ.3 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో నూతన పాఠశాల భవనంలో అభివృద్ధి పనులు చేపట్టాలని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా నిధులు సరిపోవంటూ పనులు చేట్టకుండా జాప్యం చేస్తున్నారు. నూతన పాఠశాల భవనం ఆవరణలో వసతుల కల్పనకు నిధులు కేటాయించాలని ప్రజాప్రతినిధుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షానికి పాత పాఠశాల భవనం ప్రహరీ, వంటగది, మూత్రశాలలు దెబ్బతిన్నాయి. అవి ఎప్పుడు కూలుతాయో తెలియకుండా మారాయి. దెబ్బతిన్న నిర్మాణాలు కూలి ప్రమాదం జరిగే అవకాశం ఉండటంతో మున్సిపల్ అధికారులకు ముందస్తు సమాచారం అందించారు. దీంతో మున్సిపల్ సిబ్బంది దెబ్బతిన్న ప్రహరీ, ఇతర గదులను కూల్చివేశారు.

# తల్లిపాలే రక్షణ.. పోషణ!



భూపాలపల్లి : అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి పాలు ఎంతో అవసరం... చిన్నారుల రక్షణ, పోషణకు దోహదం చేస్తాయి. ఆరోగ్యం, ఎదుగుదలలో కీలకపాత్ర పోషిస్తాయి. పుష్కలమైన పోషకాలు, రోగ నిరోధక శక్తి దాగి ఉంటుంది. ఏటా ఆగస్టు మొదటి వారంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. 'ఉద్యోగస్థులైన తల్లులు వారి పిల్లలకు పాలు పట్టించేలా అవగాహన' కార్యక్రమాలు చేపట్టడం ఈ ఏడాది వారోత్సవాల ముఖ్య ఉద్దేశం.తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని అంగన్‌వాడీ సిబ్బంది.. ఇంటింటికి వెళ్లి తల్లి పాల ప్రాముఖ్యతను వివరిస్తున్నారు. పిల్లల ఎదుగుదలకు అందించాల్సిన పోషకారం, గర్భిణులు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, గర్భిణులు, బాలింతలకు తగినంత పోషకాహారం అందించేలా కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడం, ఇంట్లోనే సమతుల ఆహారం ఎలా తయారు చేసుకోవాలో మహిళలకు తెలియజేస్తున్నారు.

ఉద్యోగస్థుల వెనకడుగు

గ్రామీణ ప్రాంతాల్లో బిడ్డకు తల్లిపాలు సక్రమంగానే అందుతున్నా.. ఉద్యోగాలు చేస్తున్న మహిళలు విధి నిర్వహణలో పడి బిడ్డలకు సరిగా తల్లిపాలు పట్టించడం లేదు. దీంతో పిల్లలు పలు రకాల అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉంటోంది. చదువుకుని అన్నీ తెలిసిన ఉద్యోగస్థులే వెనకడుగు వేస్తుండటంతో ప్రభుత్వం వారిపై దృష్టి సారించి అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటోంది.

ఎందుకంటే..

శిశువు జన్మించిన గంటలోపు ముర్రుపాలను కచ్చితంగా పట్టించాలి. బిడ్డకు రోగనిరోధక శక్తి పెంచుతాయి.

తల్లి పాలు మాత్రమే మొదటి ఆరు నెలల్లో పిల్లలను ఆరోగ్యవంతులుగా చేస్తాయి. పోషకాహార లోపానికి, వ్యాధులు రాకుండా, మరణానికి గురికాకుండా అధిక రక్షణ కల్పిస్తాయి.

శిశువులు డయేరియా, ముక్కు, గొంతు, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ వంటి అనారోగ్యాలకు దూరంగా ఉంటారు.

మొదటి ఆరు నెలలు శిశువుకు తల్లిపాలు మాత్రమే అందిస్తే మరే ఇతర ద్రవాహారాలు, ఇతర ఆహారం అవసరం లేదు.

తల్లి పాలను మాత్రమే శిశువుకు ఆహారంగా అందిస్తే గర్భానికి మరో గర్భానికి మధ్య వ్యవధి పెరుగుతుంది. దీంతో సహజంగానే కాన్పుల మధ్య దూరం ఉంటుంది.

శిశువు జన్మించిన మొదటి గంటలోపు తల్లిపాలు పట్టిస్తే ప్రసవానంతరం తల్లికి కలిగే రక్తస్రావం తగ్గడానికి దోహదపడుతుంది.

బిడ్డకు పగలు రాత్రి తేడా లేకుండా శిశువు కోరినప్పుడల్లా ఎంతసేపు పాలు తాగాలనుకుంటే అంతసేపు పట్టించాలి.

మహిళా ఉద్యోగులపై ప్రత్యేక దృష్టి- శైలజ, జిల్లా సంక్షేమాధికారి తల్లి పాల ప్రాముఖ్యతపై వారం పాటు కార్యక్రమాలను చేపడుతున్నాం. ఈ ఏడాది ఉద్యోగాలు చేస్తున్నటువంటి మహిళలపై ఎక్కువగా దృష్టి పెడుతున్నాం.. వారు తప్పనిసరిగా బిడ్డలకు పాలిచ్చేలా అవగాహన కల్పిస్తున్నాం.

# గ్రామ సభ పెట్టలేదు.. అభ్యంతరాలు స్వీకరించలేదు



బోయినపల్లి : అదనపు టీఎంసీ కాలువ నిర్మాణంలో ముంపునకు గురవుతున్న అర్హులైన నిర్వాసితులకు అందించాల్సిన పరిహారం జాబితా గెజిట్ ప్రచురణకు అధికారులు రంగం సిద్ధం చేశారు. గ్రామ సభ నిర్వహించి అందులో నిర్ణయం మేరకు గెజిట్ ప్రచురించాల్సి ఉంది. అయితే అనర్హులకు చోటు కల్పించేందుకు గ్రామసభ నిర్వహించకుండానే గెజిట్ ప్రచురణకు రంగం సిద్ధం చేసినట్లు ప్రచారం సాగుతోంది.కాళేశ్వరం అదనపు టీఎంసీ కాలువ నిర్మాణంలో భాగంగా బోయినపల్లి మండలం దేశాయపల్లి గ్రామంలోని వరద కాలువకు అవతలి వైపు ఉన్న 70 ఇళ్లు ముంపునకు గురవుతున్నాయి. నిర్వాసితుల ఇళ్లకు పరిహారం అందించడంలో భాగంగా ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులు సర్వే చేసి ఇళ్లకు నంబర్లు కేటాయించారు. వీటితో పాటు మరో 13 ఇళ్లు అటువైపు ఉన్నాయి. వీటిని కూడా ముంపుగా గుర్తించాలని స్థానికులు కోరడంతో అధికారులు అంగీకరించారు. ఇంజినీరింగ్, అటవీశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేసి అంచనాలు రూపొందించారు. మరోవైపు ఆర్‌అండ్‌ఆర్ పరిహారం అందించేందుకు రెవెన్యూ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించి నిర్వాసితుల వివరాలు సేకరించారు. ఒక్కో నిర్వాసిత కుటుంబానికి 75 చదరపు గజాల ఇంటి స్థలం, రూ.6.60 లక్షల పరిహారం, ఇంటి నిర్మాణానికి రూ. 1.25 లక్షలు చెల్లిస్తామని చెప్పారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీ కోసం భూసేకరణ చేయడానికి వరద కాలువ సమీపంలో 11 ఎకరాలు పీఎన్ (ప్రిలిమినరీ నోటిఫికేషన్) ప్రచురించారు. కాగా ఓటీఎస్ పరిహారం కావాలంటే రూ.12 లక్షలు చెల్లిస్తామని వెల్లడించారు.

ప్రధాన రహదారి వెంబడి నివాసం ఉంటున్నా...

ముంపునకు గురవుతున్న ఇళ్లలో నివాసం ఉండని వ్యక్తుల పేర్లను జాబితాలో చేర్చారంటూ ప్రచారం సాగుతోంది. ప్రధాన రహదారి వెండి నివాసం ఉంటున్న కొన్ని కుటుంబాలను ముంపునకు గురవుతున్న ఇళ్లలో నివాసం ఉంటున్నట్లు చూపించి జాబితాలో చేర్చారని చెబుతున్నారు. వీరి కోసం గ్రామ సభ నిర్వహించకుండానే గెజిట్ చేయడానికి జాబితా పంపినట్లు ఆరోపిస్తున్నారు. గెజిట్ ప్రచురిస్తే ఎలాగైనా పరిహారం పొందవచ్చని భావిస్తున్నట్లు తెలుస్తుంది. ఇరవై మందికి పైగా అనర్హులకు చోటు కల్పించారని ప్రచారం ఉంది. కాగా జాబితాను గ్రామంలో ప్రచురించి అభ్యంతరాలు స్వీకరించాల్సిన అధికారులు తమను సంప్రదించకుండా గెజిట్‌కు పంపించారంటూ స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నిర్వాసితుల వృత్తి, ఇతర వివరాలు తప్పుగా ప్రచురితమైతే బాధ్యులెవరని ప్రశ్నిస్తున్నారు.

రెండు సార్లు బహిష్కరణ

ఆర్‌అండ్‌ఆర్ జాబితా గెజిట్ ప్రచురించడంలో భాగంగా రెవెన్యూ అధికారులు గతంలో రెండు సార్లు గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఇందులో నిర్వాసితులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేసి అభ్యంతరాలు వ్యక్తం చేశారు. మొదటగా 119 మంది నిర్వాసితులతో జాబితా రూపొందించగా, తర్వాత 133 మందితో రెండో జాబితా, 144 మందితో మూడో జాబితా తయారు చేశారు. పేర్ల సంఖ్య పెంచుతూ మూడు విధాలుగా తయారు చేయడంపై పలువురు ప్రశ్నించారు. పేర్లు చదవాలని స్థానికులు పట్టుబట్టారు. అయితే అధికారులు అందుకు నిరాకరించారు. దీంతోపాటుగా ఓటీఎస్ (వన్ టైం సెటిల్‌మెంట్ కింద పరిహారం) కావాలని కొంత మంది, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఏర్పాటు చేసి పరిహారం అందించాలని మరికొంత మంది కోరడంతో కొలిక్కి రాలేదు.తీర్మానం లేకుండా ప్రచురిస్తే అంగీకరించం- ఒంటెల గోపాల్‌రెడ్డి, సర్పంచి, దేశాయపల్లి

ఆర్‌అండ్‌ఆర్ పరిహారం జాబితాపై రెండు సార్లు గ్రామ సభ నిర్వహించగా నిర్వాసితుల అభ్యంతరాలతో కొనసాగలేదు. గ్రామసభ తీర్మానం లేకుండానే గెజిట్ కోసం జాబితా పంపినట్లు గ్రామంలో ప్రచారం సాగుతుంది. అధికారులు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో నిర్వాసితులు ఆందోళనలో ఉన్నారు. ఆర్‌అండ్‌ఆర్ కమిటీ, గ్రామసభ తీర్మానం లేకుండా గెజిట్ ప్రచురిస్తే అంగీకరించం.

పరిశీలన చేస్తాం - మధుసూదన్, ఆర్డీవో, వేములవాడ

ఇటీవలే బాధ్యతలు స్వీకరించాను. దేశాయపల్లి ఆర్‌అండ్‌ఆర్ విషయం నాకు తెలియదు. గెజిట్ జాబితా, ప్రచురణ తదితర అంశాలపై పరిశీలన చేస్తాం.

# రూ.లక్ష ఆర్థిక సాయానికి రూ.4 కోట్లు విడుదల

సిరిసిల్ల: బీసీ కుల వృత్తిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయం పథకానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. జిల్లాకు తొలి విడతగా రూ.4 కోట్లు కేటాయించింది. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో పథకం ప్రారంభ సమయంలో పది మందికి మాత్రమే చెక్కులను పంపిణీ చేశారు. ఈ పథకంలో జిల్లా వ్యాప్తంగా 11,253 మంది దరఖాస్తు చేసుకోగా వాటిని పరిశీలించిన తర్వాత 9,033 మంది అర్హులను గుర్తించారు. వీరిలో తొలి విడతగా సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోని 390 మంది లబ్ధిదారులకు పంపిణీ చేయాలని నిర్ణయించారు. చొప్పదండి, మానకొండూరు నియోజకవర్గాల్లోని బోయినపల్లి, ఇల్లంతకుంట మండలాలకు సంబంధించిన అర్హుల జాబితా జిల్లా బీసీ సంక్షేమశాఖ కార్యాలయానికి రావాల్సి ఉంది. నియోజకవర్గాల వారీగా ప్రత్యేక సమావేశాలు నిర్వహించి స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో చెక్కులు పంపిణీ చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

జిల్లాలో ఎంపిక చేసిన 9,033 మంది లబ్ధిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించాలంటే రూ. 90.33 కోట్లు అవసరం. మొదటి విడతలో భాగంగా రూ. 4 కోట్లు విడుదల చేశారు. వీటిని ప్రతి నెలా 15 నుంచి 25 తేదీలోపు పంపిణీ చేయాలని నిర్ణయించారు. నిధుల కేటాయింపులో జాప్యం వల్ల ఇప్పటి వరకు పంపిణీలో జాప్యం జరిగింది.

ప్రస్తుతం ప్రభుత్వం విడుదల చేసిన నిధులు బీసీ సంక్షేమశాఖ వద్ద అందుబాటులో ఉండటంతో పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. రూ.లక్ష ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అధికార పార్టీ నేతలు సిఫారసు చేసిన వారిని ఎంపిక చేయాలనే ఒత్తిడి అధికారులపై పెరిగింది. దరఖాస్తుల ఆధారంగా అర్హులను గుర్తించారు. వారిలో ప్రతి గ్రామం, మండలం నుంచి లబ్ధిదారులు ఉండేలా చూశారు. దీనితోపాటు దశల వారీగా అర్హులైన అందరికీ పంపిణీ చేయడంతో అధికారులపై ఒత్తిడి తగ్గింది.

చెక్కులు సిద్ధం చేశాం- రాఘవేందర్, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి రూ.లక్ష ఆర్థిక సాయం పంపిణీకి ప్రభుత్వం ఇటీవలే నిధులు మంజూరు చేసింది. పథకం నిబంధనల ప్రకారం ఇప్పటికే ఎంపిక చేసిన లబ్ధిదారులకు చెక్కులు సిద్ధం చేశాం. ప్రజాప్రతినిధుల సమక్షంలో పంపిణీ చేసేందుకు ప్రణాళికలు చేస్తున్నాం.

# వక్ఫ్ ఆస్తులకు రక్షణ కరవు

జగిత్యాల : జిల్లాలో వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, వివాదాల పరిష్కారం కష్టసాధ్యంగా మారింది. స్థానికంగా వక్ఫ్ ఇన్‌స్పెక్టర్, వక్ఫ్ ఆస్తుల సమాచారం లేకపోవడం ప్రధాన ఆటంకంగా నిలుస్తోంది. జిల్లా ఏర్పాటై ఆరేళ్లు దాటినా పరిస్థితిలో మార్పు లేకపోవడంపై మైనారిటీ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వక్ఫ్ రికార్డుల ప్రకారం జిల్లా కేంద్రం జగిత్యాలలో 3 మసీదులు, ఖాళీ స్థలం, పీరీలు నిలిపే స్థలాలు(అషూర్‌ఖానాలు) 21, ముసాఫిర్‌ఖానా 1, జగిత్యాలతో 4 కలిపి జిల్లా వ్యాప్తంగా కబ్రస్తాన్లు 41 ఉన్నాయి. ధర్మపురి, కోరుట్ల, రాయికల్, బీర్‌పూర్, పొలాస అనంతారం, మల్యాల ప్రాంతాల్లో వక్ఫ్ ఆస్తులు ఉన్నాయి. జగిత్యాల పట్టణంలోని వక్ఫ్ ఆస్తులతో పాటు జగిత్యాల-కరీంనగర్ రహదారిలో ఉస్తాద్ దర్గా ఆనుకొని ఉన్న స్థలం, ధర్మపురి, కోరుట్ల తదితర పట్టణాల పరిధిలోని వక్ఫ్ భూములు కొంత మేరకు ఆక్రమణకు గురైనట్లు మైనారిటీ ప్రతినిధులు పేర్కొంటున్నారు. వీటిలో రెండు అషూర్‌ఖానాల స్థలం విషయంలో కోర్టు ద్వారా సమస్య పరిష్కారం కాగా, స్థానికంగా ఆక్రమణకు గురైన కబ్రస్తాన్లు, అషూర్‌ఖానాల భూముల విషయంలో ప్రభుత్వం సత్వరం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జగిత్యాల పట్టణం లడ్డుఖాజా చౌరస్తాలోని మక్బరా మసీదును ఆనుకొని ఉన్న కబ్రస్తాన్ 3 ఎకరాలు, ప్రైవేటు వ్యక్తి నుంచి కొనుగోలు చేసిన మరో 20 గుంటల స్థలం ఉండగా ఇందులో కొంతభాగం ఆక్రమణకు గురైనట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం గతంలో రెండుసార్లు సర్వే చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన వక్ఫ్ కమిటీ సమక్షంలో



సర్వే చేపట్టగా ఆక్రమణ విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. ఇదే ప్రాంతంలో గతంలో ముసాఫిర్ ఖానా ఉండేదని, ప్రస్తుతం దాని ఆచూకీ సైతం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జామా మసీదు ప్రాంతంలో 5 అషూర్‌ఖానాలు, పురాణిపేటలో 2, మోచీబజార్‌లో 2, నూర్ మసీదు వద్ద 1, జగిత్యాలలో మొత్తం 20 వరకు ఉండేవని, వీటిలో ప్రస్తుతం కేవలం 5 అషూర్‌ఖానాలు మాత్రమే ఉన్నాయని, వీటికి సంబంధించిన స్థలాలు ఆక్రమణకు గురికాగా, తక్కిన 15 ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి నెలకొందని స్థానికులు పేర్కొంటున్నారు. నూర్ మసీదును ఆనుకొని ఉన్న కబ్రస్తాన్ స్థలంతో పాటు, అషూర్‌ఖానాలకు సంబంధించిన స్థలాలు ఆక్రమణకు గురయ్యాయని, సత్వరం ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఖాళీగా పోస్టులు

జిల్లా ఏర్పాటయ్యాక కేవలం 6 నెలల పాటు విధులు నిర్వర్తించిన వక్ఫ్ ఇన్‌స్పెక్టర్, అటెండర్లు బదిలీపై వెళ్లగా ఇప్పటి వరకు నియామకాలు చేపట్టలేదు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా మొత్తానికి వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ ఒక్కరే సేవలు అందిస్తున్నారు. అయితే ఒకటి రెండుసార్లు మినహా వక్ఫ్ ఆస్తుల విషయంలో ఆయన జిల్లాకు రావడం అరుదైన విషయమని, కనీసం చరవాణి ద్వారా కూడా అధికారిక సమాచారం తదితరాలు పొందలేని పరిస్థితి నెలకొందని కొందరు మైనారిటీ ప్రతినిధులు పేర్కొంటున్నారు. జిల్లా ఏర్పాటై 6 ఏళ్లు దాటినా, స్థానికంగా వక్ఫ్ అధికారి, సిబ్బంది, ఆస్తులు, వివాదాలకు సంబంధించిన సమాచారం అందుబాటులో లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం- సాయిబాబా, జిల్లా మైనారిటీ సంక్షేమాధికారివక్ఫ్ ఆస్తులు, వివాదాలు, కోర్టు కేసులకు సంబంధించి ఎలాంటి సమాచారం మావద్ద లేదు. ఇప్పటి వరకు వర్ఫ్ ఇన్‌స్పెక్టర్ అందుబాటులోకి రాకవపోడంతో సమీక్షించడం వీలు పడలేదు. పలువురు మైనారిటీ నాయకులు వివిధ సమస్యలు దృష్టికి తీసుకువస్తున్నప్పటికీ, ఎలాంటి దస్త్రాలు లేకపోవడంతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం సాధ్యం కావడం లేదు. ప్రస్తుత పరిస్థితులు, తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

# దయచేసి వినండి.. ఆధునిక హంగులు కనండి!

కరీంనగర్ : ఉమ్మడి జిల్లాలోని రెండు రైల్వే స్టేషన్ల రూపురేఖలు మారనున్నాయి.. రూ.కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులతో ఆధునిక హంగులు సమకూరనున్నాయి.. కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ రైల్వే స్టేషన్ల పథకం కింద తెలంగాణలో 21 స్టేషన్లకు ఇటీవలే రూ.894 కోట్లను మంజూరు చేసింది.. ఇందులో కరీంనగర్, పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని కరీంనగర్, రామగుండం రైల్వే స్టేషన్లు ఉన్నాయి.. కరీంనగర్ స్టేషన్‌కు రూ.26.60 కోట్లు, రామగుండం స్టేషన్‌కు రూ.26.50 కోట్లు మంజూరవగా.. అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ నెల 6న ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ఈ రెండు స్టేషన్లకు సంబంధించిన శిలాఫలకాల్ని ఆవిష్కరించనున్నారు. ఈ శంకుస్థాపన కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లను రైల్వే శాఖ అధికారులు చేస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ చేపట్టాల్సిన పనులకు సంబంధించి గతంలోనే ప్రతిపాదనలు పంపడంతో అవసరమైన పనుల్ని అతి త్వరలోనే చేపట్టనున్నారు. 2024 మార్చి 31 వరకు సరికొత్త ప్రాంగణాలుగా ఈ రైలు నిలయాల్ని మార్చనున్నారు.

సరికొత్త సదుపాయాలు

ఆయా స్టేషన్ల ప్రస్తుత స్వరూపాన్ని బట్టి చేపట్టాల్సిన అభివృద్ధిపై ఇప్పటికే రైల్వే శాఖ అధికారులు కసరత్తు చేశారు. ముఖ్యంగా కరీంనగర్ రైల్వే స్టేషన్ ప్రస్తుత రూపు మొత్తం మారిపోయేలా ఆధునికీకరించనున్నారు. స్టేషన్‌కు దగ్గరగా ఉన్న ప్రాంతంలోనే కొత్తగా రూ.154.74 కోట్లతో ఆర్వోబీని నిర్మించనున్నారు. దీంతో 162 మీటర్ల పొడవుతో నిర్మించే ఆర్వోబీకి అనుసంధానంగా స్టేషన్ వరకు అవసరమైన వసతుల్ని కల్పించనున్నారు. నేరుగా ప్లాట్ ఫారం ముందు వరకు వాహనాలు వెళ్లే విధంగా ప్రత్యేక సదుపాయాలను ఏర్పాటు చేయనున్నారు. ముందు భాగంలోనూ అవసరమైన మార్పులు చేస్తారు. మరో వైపు రామగుండం స్టేషన్‌లోనూ విశ్రాంతి గదులను అదనంగా నిర్మించడం, మరో పెద్ద హాలును ఏర్పాటు చేయడంతోపాటు డిజిటల్ తెరలను ఇతరత్రా ప్రయాణికులకు అవసరమైన వాటిని పొందుపర్చబోతున్నారు. టికెట్ కౌంటర్ల చెంతన ప్రయాణికులు కూర్చునేందుకు వీలుగా సీటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడంతోపాటు లోపల ప్రస్తుతమున్న దుకాణాలకు అదనంగా ఇంకొన్నింటిని ఉంచేందుకు అవసరమైన నిర్మాణాల్ని జరపనున్నారు.

# బాబోయ్ టెం'డర్'

ఖమ్మం: రోజురోజుకూ పురోగమిస్తున్న ఖమ్మం నగరంలో అభివృద్ధి పనులకు టెండర్ల గ్రహణం పట్టుకుంది. ఈఏడాది ఆరంభంలో ఖమ్మం పర్యటన సమయంలో నగరాభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.50 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎస్‌డీఎఫ్) కింద నిధులు విడుదలవటంతో డివిజన్ల వారీగా చేపట్టాల్సిన పనులపై మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రత్యేకంగా సమీక్ష జరిపారు. అనంతరం ప్రతిపాదనలు రూపొందించి నగరపాలక సంస్థకు సమర్పించారు. ఎస్‌డీఎఫ్ నిధులతో క్షేత్రస్థాయిలో అనేక సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని భావించినా ఆశించిన మేర పనులు జరగకపోవటం గమనార్హం. ఒకట్రెండు కాదు ఏకంగా ఏడెనిమిది సార్లు టెండర్లు పిలిచినా గుత్తేదారుల నుంచి స్పందన లేకపోవడంతో బల్దియా అధికారులు, ప్రజాప్రతినిధులు తలలు పట్టుకుంటున్నారు.

నిధుల విడుదలలో జాప్యమే కారణం..?



ఎస్‌డీఎఫ్ పనులకు సంబంధించిన నిధుల విడుదలలో తీవ్ర జాప్యమే ఇందుకు కారణమని తెలుస్తోంది. ప్రత్యేక అభివృద్ధి నిధులతో చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించేందుకు సుమారు ఆరు నెలల సమయం పడుతుందని గుత్తేదారుల భావన. కొన్నిసార్లు పనులు చేసి బిల్లుల కోసం ఏడాది వరకూ ఎదురుచూడాల్సి వస్తుందని చెబుతున్నారు. మున్సిపల్ గ్రాండ్ ఫండ్ (ఎంజీఎఫ్), ఎల్ఆర్ఎస్, సుడా నిధులతో చేపట్టిన పనులకు త్వరితగతిన బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయని అభిప్రాయపడుతున్నారు. అప్పులు తెచ్చి పనులు చేసినా బిల్లులు మంజూరుకావని, వడ్డీలు పెంచుకోవటం కన్నా టెండరు దాఖలు చేయకుండా ఊరుకోవడమే మేలని ఓ గుత్తేదారు వ్యాఖ్యానించడం గమనార్హం. డివిజన్లలో పనులు చేపట్టాలని తెలిసిన గుత్తేదారులను బతిమాలుకోవాల్సి వస్తుందని కొందరు కార్పొరేటర్లు వాపోతున్నారు. మంత్రి పువ్వాడ ఆదేశాలతో రంగంలోకి దిగిన మేయర్ పునుకొల్లు నీరజ, బల్దియా ఉన్నతాధికారులు గడువు పూర్తయ్యే నాటికి అన్ని డివిజన్లలో టెండర్లు దాఖలయ్యేలా ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు సమాచారం. త్వరితగతిన మంజూరయ్యేలా హామీ ఇచ్చినట్లు తెలిసింది.

గుత్తేదారుల నిరాసక్తత

ఖమ్మం కార్పొరేషన్‌లో 60 డివిజన్లు ఉన్నాయి. ఒక్కో డివిజన్‌లో సుమారు 2.8 కి.మీ వరకు సీసీ డ్రైన్లు, రోడ్లు, కల్వర్టుల నిర్మాణాలకు టెండర్లు ఆహ్వానించారు. రూ.50 కోట్లలో కేవలం రూ.8 కోట్ల పనులకు మాత్రమే గుత్తేదారులు ముందుకొచ్చారు. 22, 24, 25, 29, 30, 32, 34, 36, 40, 41, 43, 44, 45, 46, 47, 49, 51, 52 డివిజన్లలో అసలు టెండర్లే దాఖలుకాలేదు. ఏడెమినిది సార్లు టెండర్లు పిలిచినా గుత్తేదారులెవరూ ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు. టెండరు దాఖలుకు (నేటి) శనివారం వరకే గడువుంది.

ఎస్‌డీఎఫ్ నిధులతో ప్రతిపాదించిన పనులన్నీ పూర్తిచేసేలా చూస్తాం. ఇప్పటికే కొన్ని డివిజన్లలో ఆయా పనులకు మంత్రి పువ్వాడ అజయ్ శంకుస్థాపన చేశారు. టెండర్లు దాఖలుకాని కొన్నిచోట్ల గుత్తేదారులతో మాట్లాడుతున్నాం. గడువు ముగిసే నాటికి పూర్తిస్థాయిలో టెండర్లు దాఖలయ్యేలా చూస్తాం. పునుకొల్లు నీరజ, మేయర్, ఖమ్మం

# కరకట్టలే శ్రీరామరక్ష..!

భద్రాచలం : భద్రాచలం వద్ద గోదావరికి రెండువైపులా కరకట్టల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. రూ.3,500 కోట్లకు పైగా అంచనాతో రూపొందించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరాయి. తొలుత అనుకున్న ప్రకారం 110కి.మీ. కాకుండా 85కి.మీ. పొడవునా బిట్లుగా కరకట్టలు నిర్మించాలని అధికారులు యోచిస్తున్నారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు వారంలో రాష్ట్రస్థాయి నిపుణుల కమిటీ రానుంది. ఆరుగురితో కూడిన కమిటీకి ఈఎన్‌సీ నాగేంద్రప్రసాద్ ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. భద్రాచలం పుణ్యక్షేత్రం, భారజల కర్మాగారాన్ని తరలించే వెసులుబాటు లేకపోవటంతో కరకట్టల నిర్మాణమే శ్రేయస్కరమని ఇక్కడి జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.


ఇక్కడ మాత్రం రక్షణ గోడలు

భద్రాచలం నుంచి దుమ్ముగూడెం వరకు 45 కి.మీ. మేర నాలుగైదు బిట్లుగా కరకట్ట నిర్మించాలని ప్రతిపాదించారు. ఈప్రాంతానికి మధ్యలో నదికి రెండువైపులా 36 వాగులు ఉన్నాయి. ఎనిమిది వాగులు వర్షాకాలంలో 800- 1,000 క్యూసెక్కుల నీటితో ప్రవహిస్తాయి. ఇలాంటి వాటికి కరకట్టలు కడితే ఉత్పన్నమయ్యే సమస్యలపై అధికారులు ఆరా తీస్తున్నారు. గుబ్బలమంగి, నాగినేనిప్రోలు రెడ్డిపాలెం, ఎటపాక వాగు వంటి చోట్ల కట్టల కన్నా రెండువైపులా ఎత్తుగా రక్షణ గోడలు నిర్మించాలని యోచిస్తున్నారు. నదికి ఆవలి ఒడ్డున బూర్గంపాడు మండలం నుంచి అశ్వాపురం మండలం వరకు 40 కి.మీ. పొడవున కరకట్టలు నిర్మించను న్నారు. దిగువ ప్రాంతంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తైతే భద్రాచలం, బూర్గంపాడు మండలాలకు బ్యాక్ వాటర్ సమస్య తప్పదు. 36 లక్షల క్యూసెక్కుల వరద డిశ్ఛార్చ్ అయినా ముంపు ముప్పు తలెత్తకూడదనే ఉద్దేశంతో నూతన కరకట్టల ప్రణాళిక రూపొందించారు.

శాశ్వత ప్రాతిపదికన పనులు భద్రాచలం వద్ద ఇప్పటికే 7.7 కి.మీ కరకట్ట ఉంది. 1999లో సుమారు 80 అడుగుల ఎత్తులో దీనిని నిర్మించారు. వరదల ఉద్ధృతికి 75 అడుగుల ఎత్తుకు కరకట్ట కుంగిపోయింది. దీన్ని మరో 20 అడుగుల ఎత్తు పెంచనున్నారు. కరకట్ట పైభాగంలో సీసీ ఏర్పాటుతో వెడల్పును 15 అడుగుల నుంచి 20 అడుగులకు విస్తరించనున్నారు. కూనవరం రోడ్డువెంట శిశుమందిర్ వైపు కి.మీ. పొడవున ప్రధాన రహదారిని కలుపుతూ రూ.26.5 కోట్లతో కట్ట నిర్మించాలని ప్రతిపాదించారు. విస్తాకాంప్లెక్స్ వద్ద 1,800 హెచ్‌పీ మోటర్లను వినియోగిస్తున్నా రామాలయం పరిసరాలకు ముంపు తప్పడం లేదు. ఇక్కడ శాశ్వత ప్రాతిపదికన రూ.3 కోట్లతో సొంత మోటర్లను కొని షెడ్లు నిర్మించనున్నారు. మురుగునీరు స్నానఘాట్లలో కలవకుండా కట్ట అంచు నుంచి పైపుల గుండా వినాయక నిమజ్జన ర్యాంపు సమీపంలో నదిలోకి చేరేలా ప్రణాళికలు రచిస్తున్నారు.లోతట్టు ప్రాంతాల తరలింపు జరిగేనా..?

తీర ప్రాంతాల్లో పదికి పైగా ఆవాసాలు మూడో ప్రమాద హెచ్చరిక ముందే ముంపులో చిక్కుకుంటున్నాయి. బాధిత కుటుంబాల సంఖ్య తక్కువే అయినా వీటిని యథావిధిగా ఉంచి కరకట్టలు నిర్మించాలంటే కి.మీ.కు రూ.30 కోట్లు అదనంగా వెచ్చించాల్సి వస్తుందని భావిస్తున్నారు. ఆయా కుటుంబాలు ఇష్టపూర్వకంగా మెరక ప్రాంతాలకు తరలివెళ్లేలా కసరత్తు మొదలుపెట్టారు. బాధితులకు పక్కాగృహాలు లేదా పరిహారం ఇస్తే కొంత ప్రయోజనం ఉంటుందనే చర్చ సాగుతోంది. భద్రాచలం- దుమ్ముగూడెం మండలాల పరిధిలో 9.5 కి.మీ మేర ఏపీ సరిహద్దు ఉంది. ఈ ప్రాంతంలో కరకట్ట నిర్మాణానికి ఏపీ ప్రభుత్వం, పోలవరం ప్యాకేజీ అథారిటీ సాయం అవసరం.

# సిబ్బంది లేక ఇబ్బంది




ఖమ్మం : నిత్యం ప్రజలకు అవసరమయ్యే విద్యుత్తు సంస్థను ఉద్యోగుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ముఖ్యంగా విద్యుత్తు బిల్లింగ్, రెవెన్యూ వసూళ్లు, బిల్లుల్లో తప్పులు సరి చేయడంలో కీలకంగా వ్యవహరించే జూనియర్ అసిస్టెంట్లు అందుబాటులో లేక అధికారులు, వినియోగదారులు అవస్థ పడుతున్నారు. ఈ కేటగిరీలో జిల్లాలో కేవలం 16శాతం మంది మాత్రమే అందుబాటులో ఉన్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

జూనియర్ అసిస్టెంట్ల విధులు...జూనియర్ అసిస్టెంట్లు విద్యుత్తు సంస్థ ఆదాయం వసూళ్లను పర్యవేక్షిస్తారు. సీనియర్ అసిస్టెంట్లకు సహాయకులుగా ఉంటారు. ఎనర్జీ బిల్లింగ్ సిస్టం(ఈబీఎస్)లో కీలకం. స్పాట్ బిల్లింగ్ యంత్రాలకు నెలనెలా సాఫ్ట్‌వేర్ అప్‌లోడ్ చేయడంతోపాటు, బిల్లింగ్ తదుపరి డౌన్‌లోడ్ చేసుకుని తమ పరిధిలో నెలవారీ రెవెన్యూ డిమాండ్‌ను సిద్ధం చేస్తారు. అలాగే ఎవరైనా తమ బిల్లులో సమస్య ఉందని అధికారుల దృష్టికి తీసుకొస్తే సరి చేయాల్సి ఉంటుంది.

అందుబాటులో కేవలం 14 మందే...

జిల్లా విద్యుత్తు సంస్థలో సర్కిల్, డివిజన్ కార్యాలయాలతోపాటు, ఈఆర్వో కార్యాలయాల్లో 86 జూనియర్ అసిస్టెంటు పోస్టులు ఉన్నాయి. వీటిలో కేవలం 14 మంది పని చేస్తుండగా 72 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీరే కాకుండా సీనియర్ అసిస్టెంటు పోస్టులు జిల్లాలో 61 ఉండగా 13 ఖాళీలున్నాయి.

మిగిలిన వారు సర్కిల్, డివిజన్ కార్యాలయాల్లో పని చేస్తున్నారు. నెలవారీగా రూ.కోట్ల రెవెన్యూ ఉన్నా జూనియర్ అసిస్టెంటు పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఇతర సిబ్బంది ఈ విధులను నిర్వహిస్తున్నారు. దీనివల్ల అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఆయా ప్రాంతాల్లోని వినియోగదారుల్లో ఎవరికైనా బిల్లులో సమస్య వస్తే కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. సమస్య పరిష్కారమయ్యేందుకు నెలల సమయం పడుతోంది. అలాగే పాత బకాయిల వసూళ్లపైనా ప్రభావం కనిపిస్తోంది. మిగిలిన సిబ్బందికి పని విభజన చేయడం అధికారులకు తలనొప్పిగా తయారైంది.

అర్హులైన వారితో భర్తీ చేయాలి

కార్యాలయాల్లో జూనియర్ అసిస్టెంట్ల కొరత భారీగా ఉంది. మిగిలిన సిబ్బందిపై పని ఒత్తిడి పెరుగుతోంది. అర్హులైన వారితో ఈ పోస్టులను భర్తీ చేస్తే సంస్థకు ప్రయోజనం కలుగుతుంది.

తక్కెళ్లపల్లి శేషగిరిరావు, ప్రాంతీయ కార్యదర్శి, 1104 సంఘం

# ఊడ్చేసిన వరద



కొత్తగూడెం : కాకతీయుల కాలం నుంచి బాసటగా నిలుస్తున్న చెరువులు, కుంటలు భారీ వర్షాలకు కోతలకు గురవుతూ అన్నదాతలకు కన్నీటి వెతలు మిగుల్చుతున్నాయి. అధికారులు తాత్కాలిక మరమ్మతులకు ప్రాధాన్యమిస్తుండటంతో ఏటా సమస్య పునరావృతమవుతోందని రైతులు వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఉభయ జిల్లాల్లో అనేక చెరువులు, కుంటలు, ప్రధాన కాల్వలు దెబ్బతిన్నాయి. ఈసారైనా అధికారులు శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని కర్షకులు కోరుతున్నారు. ఈ వానాకాలం పుష్కలంగా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ ముందస్తుగానే ప్రకటించినా.. జలవనరులశాఖ అధికారులు అప్రమత్తం కాలేదనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. తద్వారా అనేకచోట్ల చెరువులకు గండ్లు పడ్డాయి. చెక్‌డ్యాంలు దెబ్బతిన్నాయి. ఖమ్మం జిల్లా పెనుబల్లి వద్ద సాగర్ ప్రధాన కాల్వ యు.టీ(అండర్ టన్నెల్) గోడ ధ్వంసమైంది. సింగరేణి మండలం గేట్‌కారేపల్లిలోని సంగం కుంట తూము పైభాగంలోని మట్టికట్ట కొట్టుకుపోయింది. ముదిగొండ మండలంలో సాగర్ ప్రధాన కాల్వ యు.టి. మట్టికట్ట తెగింది. వెలుగుమట్ల వద్ద సాగర్ ప్రధాన కాల్వ రక్షణ గోడ దెబ్బతింది. ఖమ్మం జిల్లాలో రూ.1.94 కోట్ల నష్టం వాటిల్లింది. భ్రీద్రాద్రి జిల్లాలోని గుండేటివాగు కుడికాల్వ కోతకు గురైంది. కిన్నెరసాని చెక్‌డ్యాం దెబ్బతింది.

ఏటా అవే తిప్పలుఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలో ఆకేరు నదిపై హైదర్‌సాయిపేట, అజ్మీరతండా, పిండిప్రోలు, తిప్పారెడ్డిగూడెంలో ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. వీటిలో 16 మోటర్లు బిగించి సమీప చెరువులకు నీటిని సరఫరా చేస్తున్నారు. ఏటా వర్షాకాలంలో వరదలకు ఇవి ముంపునకు గురవుతున్నాయి. అధికారులు మరమ్మతులు చేయించే వరకు ఆయకట్టు రైతులకు ఇబ్బందులు తప్పవు. నది సమీపంలోనే ఎత్తిపోతల పథకాలను నిర్మించడంతో ఏటా ముంపునకు గురవుతున్నాయని, అధికారులు శాశ్వత పరిష్కారం కోసం వాటి ఎత్తు పెంచాలని రైతులు కోరుతున్నారు.

భద్రాద్రి జిల్లా పాల్వంచ గ్రామీణ మండలం నాగారం వద్ద రూ.12కోట్లతో నిర్మించిన చెక్‌డ్యాం ఇటీవల వరద ఉద్ధృతికి పూర్తిగా దెబ్బతింది. దిగువకు ప్రవాహం పోటెత్తగా కిన్నెరసాని పరివాహక ప్రాంతాల వ్యవసాయ భూములు కోతకు గురయ్యాయి. ఇసుక మేటలు వేశాయి. పలువురు రైతులు భారీగా నష్టపోయారు.

భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం రెడ్డిగూడెం సమీపంలోని గుండేటివాగు కుడికాల్వ కోతకు గురైంది. ఆయకట్టు రైతులకు సాగునీరందే పరిస్థితి లేదు. ఎడమ కాల్వకు లీకేజీలు ఎక్కువవటంతో 1,000 ఎకరాల ఆయకట్టులో సగానికి మాత్రమే నీరందుతోంది. రూ.42 లక్షలతో మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు అక్కడక్కడ చెరువులు దెబ్బతిన్నాయి. మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం.

శంకర్‌నాయక్, సీఈ, జలవనరుల శాఖ

గుండేటివాగు చెరువుపై ఆధారపడి 1,000 ఎకరాల భూమి సాగవుతోంది. కుడికాల్వ కోతకు గురికావడం, ఎడమ కాల్వకు లీకేజీలు ఎక్కువ కావడంతో పూర్తి ఆయకట్టుకు నీరందటం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కాల్వలకు శాశ్వత మరమ్మతులు చేయించాలి.

చెప్పల కొమ్మిరెడ్డి, రైతు, రెడ్డిగూడెం, అశ్వారావుపేట మండలం

తిరుమలాయపాలెం మండలంలో నాలుగు ఎత్తిపోతల పథకాలు వరదలకు మునిగిపోయాయి. మోటర్లు పాడయ్యాయి. వాటిని అధికారులు మరమ్మతులకు తీసుకెళ్లారు. బాగుచేయించి వెంటనే బిగిస్తే ఆయకట్టు రైతులకు సమస్య ఉండదు. బోడ శ్రీను, రైతు, అజ్మీరతండా, తిరుమలాయపాలెం మండలం

# ఐటీఐలో ప్రవేశాలు అంతంత మాత్రమే

ఖమ్మం : జిల్లాలోని పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)ల్లో ప్రవేశాలకు విద్యార్థులు ముందుకు రావడం లేదు. వృత్తివిద్యతో ఉపాధికి భరోసా ఉన్న ఈ కేంద్రాల్లో ఈ ఏడాది స్వల్ప సంఖ్యలోనే సీట్లు భర్తీ అయ్యాయి. ఖమ్మం జిల్లాలో జిల్లా కేంద్రంలో ఉన్నది ఒక్కటే ప్రభుత్వ ఐటీఐ. మిగతావన్నీ ప్రైవేటువే. ఇప్పటి వరకు రెండు విడతల కౌన్సెలింగ్ పూర్తయినా మొత్తం 1,540 సీట్లకు 132 మాత్రమే భర్తీ అయ్యాయి. ఇంకా 1,408 మిగిలి ఉన్నాయి.ఒక కళాశాలలో ఇప్పటి వరకు ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. మరో రెండు కళాశాలల్లో 7, 8 మంది మాత్రమే చేరారు. ఒక్క ఖమ్మం ప్రభుత్వ ఐటీఐలో తప్ప మిగతా ప్రైవేటు కళాశాలల్లో ఒక్కోదాంట్లో 20 మందికి లోపే చేరారు. వందల సంఖ్యలో సీట్లు మిగిలిపోతున్నాయి. ఒకప్పుడు సీటు దొరకని పరిస్థితి ఉన్న కళాశాలల్లో నేడు చేరే దిక్కు లేక వెలవెలబోతున్నాయి.

కొన్ని కోర్సులకే ఆదరణ...ఎలక్ట్రికల్, వెల్డర్, ఐటీ(అగ్రికల్చర్), ఎలక్ట్రీషియన్, కంప్యూటర్ కోర్సులపై ఎక్కువ మంది విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఆటోక్యాట్, కంప్యూటర్ ఎయిడెడ్ డిజైనింగ్ లాంటి కోర్సులకు సత్వరం ఉపాధి లభిస్తోంది. జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ ఇక్కడ చదివే విద్యార్థులకు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారి ద్వారా ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. మొత్తం 20లో ఇప్పటికే 17 మంది విద్యార్థులు పలు కంపెనీల్లో ఉద్యోగులుగా చేరారు. డీజిల్ మెకానిక్, మోటర్ మెకానిక్ లాంటి కోర్సులకు ప్రస్తుతం మార్కెట్లో విపరీతమైన డిమాండ్ ఉన్నప్పటికీ అర్హులైన అభ్యర్థులు లేరు.మహిళలకు స్వయం ఉపాధి కల్పించే కోర్సు అయిన డ్రెస్ మేకింగ్‌కు ఎవరూ ముందుకు రావడం లేరు. పదో తరగతి తప్పిన వారైనా దరఖాస్తుకు అర్హులు. ఏడాది కోర్సు ఇది.మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కొత్త కోర్సులను ప్రారంభిస్తున్నాం. ఇప్పటికే పలు కంపెనీలు తమ కళాశాలకు వచ్చి అనేక మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాయి. రాష్ట్రంలోనే అరుదైన కొత్త కోర్సులకు తమ కళాశాల కేంద్రంగా ఉంది. మూడో విడతలో కళాశాలలో మరింత మంది విద్యార్థులు చేరే అవకాశం ఉంది. ప్రతి కోర్సుకు ఉన్న ఉపాధి అవకాశాల గురించి విద్యార్థులకు ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నాం.ఎ.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్, ప్రభుత్వ ఐటీఐ, ఖమ్మం

# స్పందించండి.. పరిష్కారం చూపండి

వరంగల్ : హంటర్‌రోడ్ బొందివాగు నాలా ఉద్ధృతితో ఎన్టీఆర్‌నగర్, సాయినగర్, బృందావన్ కాలనీ, సంతోషిమాత కాలనీలు ఏటా మునుగుతున్నాయి. సుమారు 500 కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2020 సెప్టెంబరులో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సూచించినట్లుగా బొందివాగు నాలాను విస్తరించి, ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మించాలి.

ఉర్సు ట్యాంకుబండ్ పనులు ఏవీ..

ఎం.నాగరాజు, కరీమాబాద్

ఉర్సు చెరువు సుందరీకరణ చేస్తామని మూడేళ్లుగా చెబుతున్నారు. ఇంత వరకు పనులు మొదలవడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలతో సమీపంలోని డీకేనగర్, బీఆర్.నగర్ కాలనీలు ముంపునకు గురయ్యాయి. శాశ్వత పనులు చేపట్టాలి. భద్రకాళి బండ్ మాదిరిగా ఉర్సు బండ్‌ను అభివృద్ధి పరచాలి.

కబ్జాలు తొలగించండి..

– పెరుమాళ్ల లక్ష్మణ్, చెరువులు, కుంటల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు

దేశాయిపేట చిన్నవడ్డేపల్లి, ములుగురోడ్ కోట చెరువు, గొర్రెకుంట కట్టమల్లన్న చెరువుల ఆక్రమణలు తొలగించాలి. మత్తడి నీళ్లు వెళ్లేందుకు అనుబంధంగా నాలాలు విస్తరించి, ఇరువైపులా గోడలు కట్టాలి. ఎఫ్‌టీఎల్ నిబంధనలు కఠినతరం చేయాలి.

నాలా ఆక్రమణలు కూల్చాలి

–కేడల ప్రసాద్, రంగశాయిపేట

రంగశాయిపేట బెస్తం చెరువు మత్తడి నీళ్లు వెళ్లే నాలాను మూడెకరాల వరకు ఆక్రమణకు గురైంది. దీనివల్ల సమీప కాలనీలు నీట మునుగుతున్నాయి. సాకరాశికుంట నాలాను విస్తరించాలి.

పీహెచ్‌సీలకు శాశ్వత భవనాలు కావాలి

– మండల పరశురాములు, రంగశాయిపేట

వరంగల్ తూర్పులోని పట్టణ ఆరోగ్య కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. శాశ్వత భవనాలు ఏర్పాటు చేయాలి. రంగశాయిపేట డిగ్రీ కళాశాలకు పక్కా భవనం, నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

గ్రంథాలయం, క్రీడా మైదానం ఏర్పాటు చేయండి

–బి.రంజిత్, శివనగర్

తూర్పులో పెద్ద గ్రంథాలయం లేదు. క్రీడాశిరుల కోసం ఆధునిక వసతులతో క్రీడా మైదానం ఏర్పాటు చేయాలి. నగరంలో భూగర్భ డ్రైయినేజీ ఏర్పాటు చేయాలి.

ముంపు పనులకు రూ.250 కోట్లు

– తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

లోతట్టు ప్రాంతాలు, ముంపు కాలనీల్లో శాశ్వత పరిష్కారానికై రాష్ట్ర ప్రభుత్వం రూ.250 కోట్లు కేటాయించింది. కొన్ని ప్రాంతాల్లో పనులు జరుగుతున్నాయి. బొందివాగు నాలా విస్తరణ, గోడలు కట్టేందుకు వారం రోజుల క్రితమే రూ.156 కోట్లు మంజూరు చేశారు. ఇంకా అదనపు నిధులు, ముంపు కాలనీల సమస్యలపై మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తా. నాలాల విస్తరణ, చెరువుల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరాను. మూడు పట్టణ ఆరోగ్య కేంద్రాల భవనాలకు నిధులు వచ్చాయి. గ్రంథాలయం, క్రీడా మైదానం కోసం స్థలాలు అన్వేషిస్తున్నాం.

వర్ధన్నపేటమామునూరు విమానాశ్రయం కోసం చాలా ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. త్వరగా విమానాశ్రయ నిర్మాణ పనులు జరిగేలా చూడాలి.

రాజేశ్‌రెడ్డి, మామునూరు

ఎమ్మెల్యే అరూరి రమేశ్ : ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం విమానాశ్రయ నిర్మాణానికి ఆమోద ముద్ర వేసింది. త్వరగా పనులు జరిగేలా చర్యలు తీసుకుంటా.

సమస్య: వరంగల్ నాయుడు పంపు పెట్రోల్ పంపు వెనుక వినాయకనగర్ కాలనీ రోడ్డు నంబరు- 3లో సీసీ రోడ్లు లేక ఇబ్బంది పడుతున్నాం.పొలుసాని సుభాష్, వినాయకకాలనీ

సీసీరోడ్డు నిర్మాణానికి రూ.75లక్షలతో ప్రతిపాదనలు పంపించాం. టెండర్ దశ పూర్తికాగానే పనులు ప్రారంభమవుతాయి.

సమస్య: 2006 నుంచి 2016 వరకు హౌసింగ్ కార్పొరేషన్‌లో పది సంవత్సరాలు పనిచేసిన వర్క్‌ఇన్‌స్పెక్టర్లు 1179 మంది ఉద్యోగులను ప్రభుత్వం తొలగించింది. ఉద్యోగాలు కోల్పోయిన వారికి ఇతరశాఖల్లో సర్దుబాటు చేస్తామని హామీ ఇచ్చింది. కానీ హామీ నెరవేరలేదు. గృహలక్ష్మి పథకంలో మమ్మల్ని తీసుకోవాలి.

యాకూబ్, నెక్కొండ

సమస్యను సంబంధితశాఖ మంత్రి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకొనివెళ్లి పరిష్కారానికి నా వంతు కృషి చేస్తా.నర్సంపేట

పార్కును అభివృద్ధి చేయండి–కటారి ఉత్తమ్‌కుమార్, నర్సంపేట

నర్సంపేటలో ఇప్పటి వరకు ఒక్క పార్కు కూడా లేదు. కుమ్మరి కుంటను ఉద్యానవనంగా తీర్చిదిద్దుతామని పదేళ్లుగా చెబుతున్నారు. ఎకో టూరిజం నిధులు వచ్చాయని ఒకసారి చెప్పారు. 2018 ఎన్నికల ముందు టీయూఎఫ్‌డీసీ కింద కుమ్మరికుంట, ఉద్యానవనం అభివృద్ధికి రూ.3.5కోట్లు వచ్చాయన్నారు. వెంటనే పనులు చేపట్టండి.

వంతెన నిర్మించాలి..జాడి అచ్యుత్‌కుమార్

పాకాల చెరువు మత్తడి పోసినప్పుడల్లా ఖానాపురం మండలం అశోక్‌నగర్ శివారులోని లోలెవల్ వంతెన పైనుంచి వరద పారుతుంది. దీంతో నర్సంపేట నుంచి పాకాల, కొత్తగూడ, గంగారం మండలాలకు రాకపోకలు నిలిచి పోతాయి. పెద్ద వంతెన నిర్మాణం చేస్తామని నాయకులు చెప్పే మాటలు ఎన్నికల హామీగానే మిగిలింది. ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించి వంతెన సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ప్రజల రవాణా కష్టాలు తీర్చాలి.

# మూతపడి.. ఉపాధి కరవై!

వరంగల్ : నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఎలాంటి పరిశ్రమలు లేవు.. దీంతో చాలా మంది నిరాశ చెందుతున్నారు.. స్టేషన్‌ఘన్‌పూర్‌లో 1985లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 15 ఎకరాల్లో 24 మంది దళితులకు కోళ్ల ఫారాలతో పాటు ఇళ్లు నిర్మించి ఇచ్చింది. ప్రభుత్వమే కోళ్ల దాణా పంపిణీ చేసి కోడిగుడ్లు తీసుకునేది.. ఎనిమిదేళ్ల పాటు బాగానే ఉంది. దాణాకు డబ్బులు చెల్లించడంతో పాటు గిట్టుబాటు ధర రాలేదు. కోళ్ల ఫారాల అభివృద్ధికి ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని పలుమార్లు వేడుకున్నా పట్టించుకోలేదు. దీంతో ఫారాలు మూతపడ్డాయి. 15 ఎకరాల చుట్టుపక్కల ఉన్న కొందరు భూ కబ్జాకు పాల్పడ్డారని లబ్ధిదారుడు కలకోళ యాదగిరి వివరించారు. తమకు ఉపాధి కల్పించాలని వేడుకుంటే స్థానిక ఎమ్మెల్యేలు తమకు కేటాయించిన స్థలాల్లో ఆశ్రమ పాఠశాలల నిర్మాణానికి ఒత్తిడి తెచ్చారని చెప్పారు. ఇప్పటికైనా తమకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.


తోళ్ల పరిశ్రమ జాడేది? స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని నమిలిగొండలలో దళితులకు ఉపాధి కల్పించేందుకు తోళ్ల పరిశ్రమ(మినీ లెదర్ పార్క్)ను ఏర్పాటు చేశారు. రెండు వందల మందికి శిక్షణ ఇచ్చారు. చెప్పుల తయారు చేశారు. కొద్దిరోజుల పాటు పరిశ్రమ నడిచింది. ఆ తర్వాత ప్రభుత్వ ప్రోత్సాహం లేక మూతపడింది. 20 ఏళ్లు దాటుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. అందులోని యంత్రాలు, ఇతర సామగ్రి తుప్పుపట్టి పోయాయి. లెదరు పార్క్ నడిచేలా చూడాలని నిరుద్యోగులు అనేకమార్లు ఎమ్మెల్యేలు, మంత్రుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం. దీన్ని మెగా పార్క్‌గా మార్చితే 2 వేల మందికి ఉపాధి లభిస్తుందని నేతలు భావించారు.

# క్రమబద్ధీకరణలో కదలిక

నల్గొండ : అనధికార లేఅవుట్లల్లోని ఇళ్ల స్థలాల(ప్లాట్ల) క్రమబద్ధీకరణకు ప్రవేశపెట్టిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాలో 19 పురపాలికలు ఉండగా నందికొండ మినహా మిగతా 18 పట్టణాల్లో 10 నవంబరు 2020 వరకు ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పేరిట దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. దరఖాస్తుతో పాటు రూ.1000 చొప్పున ప్రభుత్వం రుసుము వసూలు చేసింది. మొత్తం పూర్వ జిల్లా పరిధిలో 2.54 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వివిధ కారణాలతో రెండున్నరేళ్లుగా వాటిని పెండింగ్‌లో ఉంచారు. తాజాగా పురపాలికల్లోని ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిశీలించాలన్న ఉన్నతాధికారుల సూచనలతో అధికారులు పది రోజులుగా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు.

రెండు సార్లు అవకాశం

భారాస ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2015లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు స్వీకరించింది. అప్పట్లో ప్రతి దరఖాస్తుతోపాటు రూ.10,000 చొప్పున ఫీజు వసూలు చేశారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 20 వేల దరఖాస్తులు వచ్చాయి. రెండేళ్ల పాటు వాటిని పరిశీలించి చాలా వరకు క్రమబద్ధీకరించారు. 2019లో మరోసారి ఫీజు చెల్లించిన వారి ప్లాట్లనూ క్రమబద్ధీకరించారు. అందులో ఇంకా మూడు వేల మంది దరఖాస్తుదారులు ముందుకు రాకపోవడంతో పక్కన పెట్టారు. రెండో విడతలో 2019లో ఎల్ఆర్ఎస్ పథకాన్ని ప్రభుత్వం తెరమీదకు తీసుకొచ్చింది. రూ.1000 ఫీజుతో దరఖాస్తులు స్వీకరించింది. అప్పుడు



ఉమ్మడి జిల్లాలో 2.54 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఎల్ఆర్ఎస్‌పై కొందరు హైకోర్టును ఆశ్రయించారు. అది ఇంకా తేలకుండానే ప్రభుత్వ మౌఖిక ఆదేశాలతో దరఖాస్తులు పరిశీలించి క్రమబద్ధీకరణకు శ్రీకారం చుట్టారు. అయితే రూ.1000 చెల్లించిన దరఖాస్తుదారులకే ప్రాధాన్యమిస్తున్నారు. గతంలో రూ.10,000 చెల్లించి ఎల్ఆర్ఎస్ కోసం ఎదురుచూస్తున్న దరఖాస్తులను పట్టించుకోకపోవడంతో వారు నిరాశతో ఉన్నారు.

భారీగా సమకూరనున్న ఆదాయం

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది. అదే స్థాయిలో ప్రజలపై ఆర్థిక భారం పడనుంది. అనుమతి లేని ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ సమయంలో ఉన్న ప్లాటు మార్కెటు విలువలో 14 శాతం రుసుము వసూలు చేస్తోంది. అది తమకు పెనుభారమని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక కుటుంబానికి పది ప్లాట్లు ఉంటే అందులో ఒకటి విక్రయించి వచ్చిన సొమ్ముతో మిగతా ప్లాట్లు క్రమబద్ధీకరించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పిల్లల పెళ్లిళ్లు, భవిష్యత్ అవసరాల పేరిట కొందరు 20, 30 ఏళ్ల కింద ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఉన్నారు. ఇప్పుడు ఎల్ఆర్ఎస్‌కు వసూలు చేస్తున్న రుసుము నాటి ప్లాట్ కొనుగోలుకు ఎన్నో రెట్లు ఎక్కువ ఉందని వాపోతున్నారు.

ప్రస్తుతానికి పట్టణాల్లోనే..

లక్ష్మీనారాయణ, పట్టణ, గ్రామీణ ప్రణాళికాధికారి, నల్గొండ

ప్రస్తుతానికి పట్టణాల్లోని ప్లాట్ల దరఖాస్తులు మాత్రమే పరిశీలించాలని ఆదేశాలు ఉన్నాయి. పరిశీలన ప్రక్రియ ప్రారంభమైంది. మార్గదర్శకాలకు లోబడి అన్ని సక్రమంగా ఉన్న దరఖాస్తులను మాత్రమే పరిశీలించి క్రమబద్ధీకరణకు ప్రభుత్వానికి పంపిస్తాం. చెరువులు, కుంటలు, గుట్టలు, రైల్వే లైన్ల వెంట ఉన్న వాటిని క్రమబద్ధీకరించడం లేదు. వాటిపై తదుపరి ఆదేశాల తర్వాత ముందుకు వెళ్తాం.

# పంటల రుణ పరిమితి ఖరారు

సూర్యాపేట : పంటల సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఏటా రైతులకు రుణం అందిస్తూ తిరిగి సకాలంలో చెల్లించేలా ప్రోత్సహిస్తోంది. తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ లిమిటెడ్ (టెస్కాబ్) ఆధ్వర్యంలో రుణ లక్ష్యాన్ని విధించి వారికి పంటల వారీగా రుణాలు అందిస్తున్నారు. రుణాలు ఇవ్వడానికి రాష్ట్ర వ్యాప్తంగా 123 రకాల పంటలు ఎంపికైన జాబితాలో ఉండగా, ప్రస్తుతం 70 రకాలు సాగవుతున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు ఆయా పంటల సాగు చేసిన రైతులకు రుణాలు అందించేలా ప్రణాళిక రూపొందించారు. వచ్చే వానాకాలం పంటలకు బ్యాంకర్లు ఇచ్చే పంటల రుణపరిమితి ఖరారు చేశారు.

రూ.2 వేల నుంచి రూ.6 వేల వరకు పెంపు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 19,31,419 ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. అందులో చాలా వరకు రైతులు ఆయా పంటలకు సంబంధించి రుణాలు పొందారు. సకాలంలో చెల్లించిన వారికి వచ్చే సంవత్సరంలో సాగు చేసే పంటలకు రుణం అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. రుణ ప్రణాళికను తయారు చేసి నాబార్డు, వ్యవసాయ శాఖలకు నెల రోజుల క్రితమే నివేదిక పంపించారు. సదరు నివేదిక ఆధారంగా నాబార్డు ఖరారు చేసింది. వానాకాలం సాగుకు రెండు నెలల ముందుగానే తుది జాబితా ప్రకటించారు. గత ఏడాదితో పోలిస్తే అన్ని రకాల పంటలకు రూ.2 వేల నుంచి రూ.6 వేల వరకు రుణం పెంచి అందించేలా కసరత్తు చేశారు.

కూరగాయల పంటలకూ..

ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా కొద్ది రకాల పంటలు మాత్రమే సాగు అవుతున్నాయి. అందులో వరి, పత్తి, కంది, పెసర, శనగ, వేరుసెనగ, మిరప పంటలు ఇందులో ఉన్నాయి. అక్కడక్కడ ఉల్లి, మొక్కజొన్న, సోయాబీన్ తదితర పంటలు సాగు చేస్తున్నారు. ఇవి కాకుండా ఉద్యాన పంటల వైపు రైతులు దృష్టి సారించారు. ప్రధానంగా మామిడి, నిమ్మ, జామ, బత్తాయి తోటలు సాగు చేస్తుండగా, ప్రస్తుతం ఆయిల్‌పామ్‌పై దృష్టి సారిస్తున్నారు. కూరగాయల సాగును ప్రోత్సహించడంలో భాగంగా వారికి కూడా రుణం అందించేందుకు ఈ సారి ప్రభుత్వం ముందుకు వచ్చింది.

సద్వినియోగం చేసుకోవాలి: రామారావు నాయక్, జిల్లా వ్యవసాయాధికారి, సూర్యాపేట

టెస్కాబ్ ఆధ్వర్యంలో బ్యాంకులు రైతులకు రుణం సౌకర్యం కల్పిస్తున్నాయి. ఈ సారి రెండు నెలలు ముందే రుణ ప్రణాళిక ఖరారు చేసింది. ఈ సమయాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని రుణం తీసుకోవాలి. ఉద్యాన, కూరగాయ పంటలకూ రుణం తీసుకోవడానికి అవకాశం ఉంది.

# యంత్రం పదిలం.. ఆపరేటర్ క్షేమం




పెద్దపల్లి: గత ఏడాది ఓసీపీ-1లో డంపర్ ప్రమాదానికి గురై ఆపరేటర్ శ్రీనివాసరావు మృతి చెందాడు. తెల్లవారు జామున పొగమంచు ఉండటంతో ఆగి ఉన్న డంపర్‌ను ఢీకొట్టడంతో దాని వెనుక భాగం క్యాబిన్‌లోకి చొచ్చుకువచ్చి ఆపరేటర్ అందులోనే దుర్మరణం చెందాడు. డంపర్ నడిపించే ఆపరేటర్ క్యాబిన్‌కు ముందు కేవలం అద్దం మాత్రమే ఉంటుంది. ప్రమాదానికి గురైన సమయంలో రక్షణ లేకుండా పోతుంది. దీంతో ఆపరేటర్ ముందుగా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఏడాదిన్నర క్రితం ఇదే విధంగా మరో డంపర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఓసీపీ-3లో ఆపరేటర్ మృతి చెందాడు. ఈ సంఘటన సైతం తెల్లవారు జామున చోటు చేసుకుంది. ఉదయం సమయంలో ఉపరితల గని క్వారీల్లో పొగ మంచు ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో ఆపరేటర్లకు ముందు స్పష్టంగా కనిపించదు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది.

సింగరేణి ఉపరితల గనుల్లో ఎక్కువ శాతం డంపర్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఆపరేటర్లు మృతి చెందుతుండటంతో పాటు కొంత మంది తీవ్రంగా గాయపడి ప్రాణాలతో బయటపడుతున్నారు. తెల్లవారు జామున క్వారీల్లో పొగ మంచుతో పాటు రాత్రంతా ఆపరేటింగ్ విధులు నిర్వహించడం వల్ల నిద్ర ముంచుకొస్తుంటుంది. దీంతో ఎక్కువగా తెల్లవారు జామున ప్రమాదాలు చోటు చేసుకుంటుంటాయి. ఆపరేటర్‌లకు రక్షణతో పాటు డంపర్ ఎక్కువ శాతం దెబ్బతినకుండా అధికారులు సరికొత్త ప్రయోగం చేస్తున్నారు. ప్రస్తుతం ఓసీపీ-3లో దీనిని మొదలు పెట్టారు. డంపర్ క్యాబిన్ ముందు భాగంలో ఇనుప రాడ్డులతో ఫ్రేమ్‌ను అమర్చుతున్నారు. డంపర్ ప్రమాదానికి గురైనా క్యాబిన్ ముందు భాగంగా ఎక్కువగా దెబ్బతినకుండా ఉండేందుకు ఈ ప్రయోగం చేస్తున్నారు. దీంతో క్యాబిన్‌కు రక్షణ ఉంటుంది. ఫలితంగా ఆపరేటర్ ప్రమాదానికి గురికాకుండా ఉండే అవకాశం ఉంది. ప్రమాదవశాత్తు ఎదురుగా ఉన్న డంపర్‌ను ఢీకొన్నప్పటికీ ముందు ఏర్పాటు చేసిన ఇనుప ఫ్రేమ్ కొంత వరకు ప్రమాద తీవ్రతను నిరోధించనుంది. ఇనుప ఫ్రేమ్ క్యాబిన్‌కు రెండు ఫీట్ల దూరం నుంచి ఏర్పాటు చేస్తున్నారు. ఒకవేళ ప్రమాదవశాత్తు ఢీకొన్న పక్షంలో ముందుగా ఇనుప ఫ్రేమ్‌పై ఒత్తిడి పడుతుంది. దాని నుంచి లోపలికి వచ్చే సరికి తీవ్రత తగ్గుతుంది.

అన్ని ప్రాంతాల్లో అమలుకు యోచనప్రమాదవశాత్తు ఎదురుగా ఉన్న డంపర్‌ను ఢీకొన్నా ఫ్రేమ్ వల్ల తీవ్రత తగ్గి ఆపరేటర్ సురక్షితంగా బయటపడే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఓసీపీ-3లో ఈ ప్రయోగాన్ని మొదలు పెట్టారు. దీనిని సింగరేణి వ్యాప్తంగా అన్ని ఉపరితల గనుల్లో అమలు చేసేందుకు యాజమాన్యం ఆలోచిస్తోంది. ముందుగా 100, 80 టన్నుల డంపర్లకు ఇనుప ఫ్రేమ్‌ను తయారు చేస్తున్నారు. ఆ తర్వాత తక్కువ సామర్థ్యం కలిగిన డంపర్లకు సైతం ఏర్పాటు చేసే అవకాశం ఉంది. కోట్ల రూపాయల విలువ చేసే డంపర్లకు ఇది రక్షణగా ఉండనుంది. ప్రమాదానికి గురైన సమయంలో వాహనంలోని లోపలి భాగాలు దెబ్బతినకుండా ఉండే అవకాశముంది.

# బడి తెరిచే నాటికి సిద్ధం



పెద్దపల్లి : వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునఃప్రారంభం నాటికి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసేలా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. యూడైస్ నివేదిక ఆధారంగా అవసరమైన పుస్తకాలను ముద్రిస్తున్నారు. కొన్నేళ్లుగా ఏటా సగం విద్యాసంవత్సరం ముగిసిన తర్వాత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసేవారు. ఈ సారి పుస్తకాల కొరత లేకుండా ముందస్తుగా లక్ష్యాలను అనుగుణంగా జిల్లాలకు సరఫరా చేస్తున్నారు. ఒకే పుస్తకంలో తెలుగు, ఆంగ్ల, ఉర్దూ మాధ్యమాల్లో ముద్రించే బైలింగ్వెల్ విధానాన్ని గతేడాది అమలు చేయగా ఈసారి కూడా కొనసాగిస్తున్నారు. ఇప్పటికే 40 శాతానికి పైగా పాఠ్యపుస్తకాలు జిల్లాలకు చేరాయి. జూన్ మొదటి వారంలో మండల కేంద్రాల నుంచి పాఠశాలలకు తరలించనున్నారు.

ద్విభాష.. క్యూఆర్ కోడ్

గతంలో పాఠ్యపుస్తకాలను ఒకే మాధ్యమంలో ముద్రించేవారు. ప్రస్తుతం పుస్తకంలో ఒకవైపు తెలుగు, మరోవైపు ఆంగ్లంలో ముద్రణ ఉంటుంది. దీంతో తెలుగు మాధ్యమం నుంచి ఆంగ్లంలో చదువుకోవడం సులభంగా ఉంటుంది. గత సంవత్సరం తొలిసారిగా 3 నుంచి 8 తరగతుల వరకు ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. ప్రస్తుతం తొమ్మిదో తరగతి వరకు అమలవుతోంది. పిల్లలు తమకు అర్థం కాని విషయాలను తెలుగు, ఆంగ్ల భాషల్లో చదువుకుంటున్నారు. ప్రతి పాఠానికి రెండు వైపులా తెలుగు, ఆంగ్లంలో ముద్రించడంతో విద్యార్థులకు విజ్ఞానం పెరుగుతుంది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడంతో పాఠ్యాంశాలకు సంబంధించి లోతైన పరిజ్ఞానం తెలుసుకుంటున్నారు.

సకాలంలో విషయ పరిజ్ఞానం

ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు విడతల వారీగా చేరుతున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 17,08,910 పాఠ్యపుస్తకాల అవసరం ఉంది. ఇందులో ఆయా జిల్లాల్లో గతేడాదికి సంబంధించి 1,03,070 పుస్తకాలు మిగులు నిల్వ ఉండగా మిగిలిన 16,05,840 పుస్తకాలు సరఫరా అవుతున్నాయి. బైలింగ్వెల్ విధానంలో ముద్రణ నేపథ్యంలో కొంత ఆలస్యం జరుగుతోంది. ఎలాంటి సమస్యలు లేకుండా పుస్తకాలు సరఫరా చేస్తే విద్యార్థులకు సకాలంలో విషయ పరిజ్ఞానం అందనుంది. జూన్ నెలలో బడిబాట సందర్భంగా పుస్తకాలు పంపిణీ చేయనున్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, కార్పొరేట్ స్థాయిలో విద్యా బోధన అందుతుండటంతో సర్కారు బడులకు ఆదరణ పెరుగుతోంది.

కొరత లేకుండా పంపిణీ

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పూర్తి స్థాయిలో ఉచిత పాఠ్యపుస్తకాలు అందిస్తున్నాం. బడుల ప్రారంభం నాటికి అన్ని చోట్లకూ పంపిస్తాం. జిల్లాలకు అవసరమైన పాఠ్యపుస్తకాలు వస్తున్నాయి. వాటిని జిల్లాకేంద్రంలో భద్రపరుస్తున్నాం. ఎక్కడా కొరత లేకుండా పంపిణీ చేస్తాం. బైలింగ్వెల్ పుస్తకాలతో సామర్థ్యాలు మెరుగుపడుతున్నాయి. మాధవి, జిల్లా విద్యాధికారి, పెద్దపల్లి

# యార్డు వెలుపలే కాయల సేకరణ

జగిత్యాల : జగిత్యాల వ్యవసాయ మార్కెట్యార్డు పరిధి చల్‌గల్‌లోని మామిడి మండీ పరిధిలో కాయల కొనుగోలులో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మామిడి మార్కెట్లో రూ.6 కోట్ల వ్యయంతో లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన నాలుగు భారీ షెడ్లు అందుబాటులోకి రావటం, చల్‌గల్ వాలంతరి ప్రదర్శన క్షేత్రం నుంచి 10 ఎకరాల స్థలాన్ని మామిడి మండీకి తీసుకోవటంతో ఈ సీజనులో వ్యాపారులందరూ యార్డులోకి రావాల్సిందేనని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గతంలో మాదిరిగా యార్డు వెలుపల తమ సొంత స్థలాలు, ప్రైవేటు అద్దెస్థలాల్లో కొనుగోళ్లు జరపవద్దని, వ్యాపారులందరూ తప్పనిసరిగా యార్డులోనే ఏర్పాట్లు చేసుకోవాలని మార్కెటింగ్ అధికారులు వ్యాపారులకు నెలరోజుల క్రితమే నోటీసులు జారీచేశారు. ఇందుకు అనుగుణంగా గత సీజన్‌లో మార్కెట్ఫీజు చెల్లించిన వ్యాపారులకు వరుసక్రమంలో మార్కెట్లోని షెడ్లలో స్థలాన్ని కేటాయించారు. ఐనా కూడా ఇప్పటికీ దాదాపుగా 17 మంది వ్యాపారులు యార్డు వెలపలే మామిడి కాయల క్రయవిక్రయాలను జరుపుతుండటంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

మార్కెట్ ఫీజు చెల్లిస్తున్నారా?

వ్యాపారులు కొనుగోలు చేసిన సరకును ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు మార్కెటింగ్‌శాఖ తక్‌పట్టీ తప్పనిసరిగా కావాలి. కొనుగోలు చేసిన కాయల విలువను అనుసరించి మార్కెట్ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. కానీ వ్యాపారులు యార్డులోకి రానందున అధికారులు వారికి తక్‌పట్టీల పుస్తకాలను ఇవ్వలేదు. ఐనాకూడా కొందరు వ్యాపారులు చెక్‌పోస్టులవద్ద కొంత ఫీజును చెల్లించి మామిడి కాయలను ఎగుమతి చేస్తున్నారు. ఇప్పటికే 27 వేల క్వింటాళ్ల వరకు మామిడి కాయలను కొనుగోలు చేశారు. దీంతో విలువకు సమానంగా ఫీజును చెల్లిస్తున్నారా లేక విలువను తగ్గించి తక్కువఫీజు చెల్లిస్తున్నారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు మార్కెటింగ్‌శాఖ స్థానిక తక్‌పట్టీ పుస్తకాల్లో రికార్డు లేకుంటే వచ్చే సంవత్సరం షెడ్ల కేటాయింపు సక్రమంగా ఉండదు. ప్రైవేటుగా సేకరణ జరిపినపుడు అధికారుల ఆజమాయిషీ కొరవడుతుంది, తూకం, ధరల చెల్లింపు తదితరాల్లోనూ అవకతవకలు జరిగే అవకాశముంది.

ఈసారీ అటకెక్కిన బహిరంగ వేలం

నిబంధనల ప్రకారం రైతుల నుంచి కమీషన్ తీసుకునే వ్యాపారులు తప్పనిసరిగా కాయలను బహిరంగ వేలం పద్ధతిన కొనుగోలు చేయాలి. కానీ నిరుటి వరకు కమీషన్ తీసుకున్నా కూడా మండీలో పక్కాషెడ్లు అందుబాటులో లేవన్న కారణంచూపి వ్యాపారులు బహిరంగ వేలాన్ని పాటించలేదు. ఈ సారి యార్డులోనే కొనుగోళ్లు జరపాలని, వేలం పద్ధతిని పాటించాలని నిర్ణయించినా వ్యాపారులందరూ యార్డులోకి రాకపోవటంతో ఇక బహిరంగ వేలం ఈ సీజన్‌లోనూ అమలయ్యేలాలేదు. నాగ్‌పూర్ మామిడి మార్కెట్ మాదిరిగా కాయలను బహిరంగ వేలంలో కొనుగోలు చేస్తే వ్యాపారుల మధ్య పోటీపెరిగి ధరలుహెచ్చి రైతులు, తోటల గుత్తేదారులకు లాభించే అవకాశమున్నా వేలం అమలు చేయటం లేదు. మరోవైపు తరుగు, చిన్నకాయలు, మంగు తదితరాలపేరిట కోతలు రివాజుగా మారగా ధరల స్థిరత్వానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

జిల్లా కలెక్టర్‌కు నివేదిక – టి.రాజశేఖర్, మార్కెట్ కార్యదర్శి, జగిత్యాల

వ్యాపారులందరూ చల్‌గల్ మామిడి యార్డులోకి రాకపోవటంపై జిల్లా కలెక్టర్‌కు నివేదించాం. కలెక్టర్ ఆదేశానుసారం తదుపరి చర్యలు తీసుకుంటున్నాం. కొనుగోలు చేసిన కాయల విలువ ప్రకారంగా ఫీజు వసూలు చేస్తాం.

# సమాఖ్య.. స్వాహాపర్వం

ఏర్గట్ల: గ్రామీణ మహిళా ఆర్థిక సాధికారతే లక్ష్యంగా పని చేయాల్సిన డ్వాక్రా సంఘాలు అవినీతి బాట పడుతున్నాయి. బ్యాంకు రుణాల చెల్లింపుల్లో మహిళా సంఘాల ప్రతినిధులతో పాటు, సిబ్బంది చేతివాటం చూపుతున్నారు. సంఘాల సొమ్ము సొంత అవసరాలకు వాడుకుంటూ అమాయకులైన మహిళలను మోసం చేస్తున్నారు. ఇటీవల వెల్కటూర్, ఏర్గట్ల గ్రామ సమాఖ్యల్లో వెలుగుచూసిన అవినీతి ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తోంది. ఏర్గట్లలో స్వప్న గ్రామ మహిళా సంఘం రూ.5 లక్షల బ్యాంకు లింకేజీ రుణం తీసుకుంది. పది మంది సభ్యులు సంఘం అధ్యక్షురాలు లక్ష్మికి ప్రతినెల వాయిదా చెల్లిస్తున్నారు. కానీ, సదరు మహిళా ఆ డబ్బులను బ్యాంకులో చెల్లించకుండా తన సొంత అవసరాలకు వాడుకుంది. వరుసగా 11 నెలలకు సంబంధించిన రూ.3.29 లక్షల కిస్తీని(వాయిదా) స్వాహా చేసింది. విషయం బయటపడి సభ్యులు ఒత్తిడి చేయడంతో రూ.1.60 లక్షలు చెల్లించింది. మిగతా సొమ్ము రూ.1.69 లక్షలు చెల్లించకపోవడంతో సభ్యులు ఈ నెల 22న పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మెండోరా మండలం వెల్కటూర్‌లో గతేడాది ఐకేపీ వీవోఏ, సీఏ కలిసి సంఘాల సభ్యులు చెల్లించిన సొమ్మును బ్యాంకులో చెల్లించకుండా స్వాహా చేశారు. అవినీతి బయటకు రావడంతో జిల్లా అధికారులు స్పందించి విచారించారు. ఇద్దర్నీ విధుల్లో నుంచి తొలగిస్తూ సొమ్ము రికవరీకి ఆదేశించారు.

కంచె చేను మేసిన చందంగా..

జిల్లాలో 825 గ్రామ సంఘాలు ఉండగా వాటిలో 24,030 సంఘాలు, 2,38,511 మంది సభ్యులున్నారు. వీరంతా పొదుపు చేస్తూ ఏటా బ్యాంకుల నుంచి బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు తీసుకుంటున్నారు. ప్రతి నెల వాయిదాలు చెల్లిస్తున్నారు. ఈ వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించడానికి గ్రామస్థాయిలో ఒక ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటైంది.




వీరిలో సంఘం అధ్యక్షురాలు, వీవోఏలు, సీఏలు, ఏపీఎంతో పాటు బ్యాంకు ఫీల్డ్ సిబ్బంది ఈ లావాదేవీలను పర్యవేక్షిస్తూ అవినీతికి ఆస్కారం లేకుండా చూడాలి. కానీ, కంచె చేను మేసిన చందంగా సంఘం అధ్యక్షురాళ్లు, సిబ్బందే అవినీతికి పాల్పడుతున్నారు. దీంతో అమాయకులైన సభ్యులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జిల్లాస్థాయిలో పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని సంఘాల మహిళలు భావిస్తున్నారు.

రికవరీ చేయిస్తాం

రూ.3.29 లక్షలకు గానూ రూ 1.60 లక్షలు రికవరీ చేశాం. మిగిలిన రూ 1.69 లక్షలను రికవరీ చేయడానికి ప్రయత్నిస్తున్నాం. సంఘ సభ్యులకు నష్టం జరగకుండా చూస్తాం. ఇతర సంఘాల్లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పర్యవేక్షణ బలోపేతం చేస్తాను. శ్యాం, ఏపీఎం, ఏర్గట్ల

నిబంధనలు ఇవీ..

సంఘం సభ్యులు చెల్లించిన కిస్తీని అధ్యక్షురాలు వసూలు చేసి ప్రతినెల ఒక సభ్యురాలితో బ్యాంకులో కట్టించాలి. కానీ, చాలా సంఘాల్లో అధ్యక్షురాలే ఖాతాల్లో జమ చేస్తున్నారు.

వాయిదా చెల్లించిన తర్వాత కౌంటర్ ఫైల్ తీసుకోవాలి. సంఘం ఖాతా పుస్తకంలో చెల్లించిన నగదును నమోదు చేయించాలి. కౌంటర్ ఫైల్ తీసుకోకపోగా ఖాతా పుస్తకంలో నమోదు చేయించడం లేదు.

ప్రతి నెల చెల్లించిన కిస్తు కౌంటర్ ఫైల్, ఖాతా పుస్తకాన్ని ప్రతి నెల గ్రామ సంఘంలో జరిగే సమావేశంలో వీవోఏలు తనిఖీ చేసి వివరాలు నమోదు చేసుకోవాలి. కానీ, వీవోఏల నిర్లక్ష్యం, సీఏల పర్యవేక్షణ లోపం కారణమవుతోంది. మూడు నెలలుగా వాయిదాను బ్యాంకులో చెల్లించకపోతే బ్యాంకు మేనేజర్ లేదా ఫీల్డ్ అధికారి నేరుగా సంఘాల డ్యూలిస్టును సీఏకు పంపించాలి. 6 నెలలైతే ఏపీఎంకు సంఘాల అప్పు జాబితాను అందించాలి. బ్యాంకుల్లో పని ఒత్తిడి పేరుతో అధికారులు నెలల తరబడి అప్పు జాబితా ఏపీఎంకు అందించడం లేదు.

# సరిహద్దుల్లో అక్రమ దందా

ఇందూరు : మహారాష్ట్ర నుంచి జిల్లాకు అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న యువకులను తాజాగా నగర పోలీసులు పట్టుకొన్నారు. గతంలో దేశీదారు నిల్వలను సైతం సీజ్ చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో గతంలో ఎక్సైజ్‌శాఖ జరిపిన సోదాల్లోనూ.. దేశీదారు, గంజాయి నిల్వలు స్వాధీనం చేసుకొన్నారు. మహారాష్ట్ర సరిహద్దు కేంద్ర బిందువుగా వీటి అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలుస్తోంది.

దేశీదారు.. రాష్ట్రంలో నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్(ఎన్‌డీపీఎల్) కిందకు వస్తుంది. స్థానికంగా ఈ మద్యాన్ని విక్రయించొద్దు. కానీ, కొందరు యథేచ్ఛగా నిజామాబాద్‌కు ఈ మద్యాన్ని తీసుకొచ్చి వ్యాపారం చేస్తున్నట్లు తెలుస్తోంది. సమీపంలోని ధర్మాబాద్ నుంచి బాసర మీదుగా జిల్లాకు దేశీదారు నిల్వలు రవాణా అవుతున్నట్లు సమాచారం. నాందేవ్‌వాడ, హమాల్‌వాడి, ఖిల్లా చౌరస్తాలో ఇప్పటికి కొందరు దీన్ని విక్రయిస్తున్నట్లుగా ప్రచారం ఉంది. గతంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ఎక్సైజ్‌శాఖ అధికారులు,



సిబ్బంది గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపారు. గంజాయి సాగుచేస్తున్న వారిని సైతం ప్రత్యేకంగా గుర్తించారు. రైతుబంధు రాకుండా చర్యలు చేపట్టారు. అయినా తిరిగి పలు తండాల్లో గంజాయి సాగు జరుగుతుందని, వివిధ ప్రాంతాల నుంచి యువత వచ్చి కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం.

కేవలం ఐదు కేసులే నమోదు..నిజామాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఈ ఏడాది కేవలం ఐదు కేసులు నమోదయ్యాయి. వాస్తవానికి ఈ స్టేషన్ పరిధిలో అధికారులు, సిబ్బంది మధ్య సయోధ్య లేక మూడు నెలల పాటు ఎక్కడా తనిఖీలు చేపట్టలేదు. జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ బృందం ఆధ్వర్యంలో తనిఖీలు చేస్తున్నారు. అయితే స్టేషన్ల సిబ్బంది, టాస్క్‌ఫోర్స్ బృందం సమన్వయంతో పనిచేస్తే పెద్దమొత్తంలో కేసుల నమోదుకు ఆస్కారం ఉంటుంది. అక్రమ రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేయొచ్చు.




# అవిశ్వాసం వేళ ఎంపీలకు మోదీ సూచన

దిల్లీ: కేంద్ర ప్రభుత్వంపై విపక్ష కూటమి 'ఇండియా' లోక్‌సభలో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పందించారు. అది ప్రభుత్వంపై తీసుకొచ్చిన అవిశ్వాసం కాదని.. వాళ్లలో వారికే నమ్మకం లేక దీన్ని ప్రవేశపెడుతున్నారని విపక్షాలపై వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. అంతేగాక, 2024 ఎన్నికలకు ముందు ప్రతిపక్షాలపై 'సిక్స్' కొట్టాలని స్వపక్ష ఎంపీలకు సూచించారు. ఈ మేరకు పార్లమెంట్ సమావేశాల ప్రారంభానికి ముందు జరిగిన భాజపా పార్లమెంటరీ పార్టీ భేటీలో మోదీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

అవిశ్వాసంపై ఎలా స్పందించాలన్న అంశంపై భాజపా పార్లమెంటరీ పార్టీ మంగళవారం ఉదయం సమావేశమైంది. ఈ భేటీలో మోదీ ప్రసంగిస్తూ విపక్షాలపై ఘాటు విమర్శలు చేసినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. "దిల్లీ సర్వీసుల బిల్లుపై రాజ్యసభలో ఓటింగ్‌ను కొందరు విపక్ష నేతలు 2024 లోక్‌సభ ఎన్నికలకు 'సెమీఫైనల్'గా అభివర్ణించారు. అయితే, దీనిలో ఫలితం ఏంటో దేశ ప్రజలంతా చూశారు" అని మోదీ వ్యాఖ్యానించారు. ఈ 'సెమీఫైనల్'లో విజయం సాధించినందుకు గానూ పార్టీ ఎంపీలకు ఆయన శుభాకాంక్షలు తెలియజేసినట్లు సదరు వర్గాలు తెలిపాయి. ఇక లోక్‌సభలో విపక్ష కూటమి ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై మోదీ స్పందిస్తూ.. "ప్రతిపక్షాల కూటమిలో పరస్పర విశ్వాసం సన్నగిల్లింది. అందుకే ఈ తీర్మానాన్ని తీసుకొచ్చారు. కూటమిలో తమకు ఎవరెవరు ఐక్యంగా ఉన్నారు? ఎవరు లేరు? అనేది పరీక్షించుకునేందుకే వారు ఈ ప్రయత్నం చేస్తున్నారు. అంతేగానీ, ఇది మన ప్రభుత్వంపై తీసుకొచ్చిన అవిశ్వాసం కాదు" అని మోదీ విమర్శించారు. ఇక అవిశ్వాసంపై అధికార పక్షం వ్యూహాల గురించి ప్రస్తావిస్తూ.. "ఎలాగైతే చివరి బంతికి సిక్స్ కొట్టాలో.. ప్రస్తుత పరిస్థితులను ప్రతిపక్షాలపై అవకాశంగా భావించండి. 2024 ఎన్నికలకు ముందు చివరి బంతికి 'సిక్స్' కొట్టండి" అని పార్టీ ఎంపీలకు ప్రధాని సూచించారు.




# అవిశ్వాసంపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ ప్రశ్నలు

దిల్లీ: పార్లమెంట్‌లో మాట్లాడకుండా ఉండేందుకు ప్రధాని మోదీ మౌనవత్రం పట్టారని, ఆయన్ను మాట్లాడించేందుకే తాము అవిశ్వాస తీర్మానం తీసుకువచ్చామని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగొయ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వంపై విపక్ష కూటమి 'ఇండియా' ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై మంగళవారం చర్చ ప్రారంభమైంది. దీనిలో భాగంగా ఆయన ఈ మాట అన్నారు. అలాగే మూడు ప్రశ్నలను సంధించారు. 1. ఇప్పటివరకు ప్రధాని మోదీ ఎందుకు మణిపూర్‌లో పర్యటించలేదు. 2. మణిపూర్‌పై మాట్లాడేందుకు 80 రోజుల సమయం ఎందుకు పట్టింది..? అప్పుడు కూడా కేవలం 30 సెకన్లు మాత్రమే మాట్లాడతారా..? 3. ఎందుకు ఇప్పటివరకు మణిపూర్ సీఎంను తొలగించలేదు..? అని ప్రశ్నించారు. ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో జాతుల మధ్య వైరం జరుగుతోంది.

దానిపై ప్రకటన చేసేందుకు మోదీ పార్లమెంట్‌కు రావాలని గత కొద్దిరోజులుగా విపక్షాలు పట్టుబడుతున్నాయి. దాంతో ఉభయ సభల్లో వాయిదాల పర్వం కొనసాగుతోంది.

దీనిపై హోం మంత్రి అమిత్ షా బదులిస్తారని ప్రభుత్వం చెప్పినప్పటికీ.. ప్రతిపక్ష సభ్యులు వెనక్కి తగ్గలేదు. ఈ కీలక అంశంపై ప్రధానే స్పందించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలోనే విపక్షాలు అవిశ్వాస అస్త్రాన్ని ఉపయోగించాయి. ఈ చర్చలో భాగంగా గొగొయ్ మాట్లాడుతూ.. 'మేం అవిశ్వాస తీర్మానం తీసుకువచ్చేలా పరిస్థితులు ఎదురయ్యాయి. ఇది లోక్‌సభలో ఉన్న సంఖ్యాబలం గురించి తెలుసుకోవడానికి తెచ్చింది కాదు. మేం ఈ తీర్మానం నెగ్గుతామన్న నమ్మకం కూడా లేదు. కానీ, మణిపూర్‌కు న్యాయం జరగాలనే ఉద్దేశంతో తీసుకువచ్చింది' అని అన్నారు.

**రాహుల్ మాట్లాడకపోవడంపై ఘర్షణ..** ఉదయం 11 గంటలకు ప్రారంభమైన లోక్‌సభ సమావేశాలు.. గంట పాటు వాయిదాపడ్డాయి. తిరిగి మధ్యాహ్నం 12 గంటలకు సభ ప్రారంభం కాగా.. కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగొయ్ అవిశ్వాసంపై చర్చను ప్రారంభించారు. మొదట కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చర్చను ప్రారంభిస్తారని వార్తలు వచ్చాయి. కానీ అలా జరగలేదు. దాంతో సభ ప్రారంభమైన వెంటనే తీవ్ర ఘర్షణ జరిగింది. 'రాహుల్ చర్చ ప్రారంభిస్తారనుకున్నాం. చివరి 5 నిమిషాల్లో ఏమైంది' అని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి ప్రశ్నించారు. ఈ సమయంలో ఎంపీల మధ్య కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రస్తుతం దీనిపై సభలో చర్చ కొనసాగుతోంది.




# బాబాయ్ వివేకా జయంతి మరిచారు.. వర్ధంతి అయితే డేట్, టైమ్‌తో సహా గుర్తుంటుంది..

అమరావతి : ఇవాళ మాజీ మంత్రి, సీఎం వైఎస్ జగన్ బాబాయ్ జయంతి. అయితే జగన్ సహా ఎవరూ కూడా ఆయన జయంతిని పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ.. వివేకా జయంతి సందర్భంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నివాళులు అర్పిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. వేటు వేసిన చేతితోనే బాబాయ్ జయంతికి ట్వీట్ వేస్తే బాగోదనేమోనని వేయలేదన్నారు. "ఈ రోజు బాబాయ్ వైఎస్ వివేకానందరెడ్డి గారి జయంతి, అబ్బాయిలు మరిచిపోయినట్టున్నారు. వీరికి బాబాయ్ జయంతి గుర్తుండదు కానీ వర్ధంతి మాత్రం డేట్, టైముతో సహా గుర్తుంటుందని సీబీఐ నిర్ధారించింది. వేటు వేసిన చేతులతోనే బాబాయ్ జయంతికి ట్వీటు వేస్తే బాగోదనేమో వేయలేదు.

అబ్బాయిల వేధింపులు-కుతంత్రాలకి ఎదురొడ్డి సోదరి సునీత గారు చేస్తున్న న్యాయ పోరాటంలో తప్పక గెలుస్తారు. తన తండ్రిని చంపిన కన్నింగ్ కజిన్స్‌తో జైలు ఊచలు లెక్కపెట్టించే వరకూ విశ్రమించరు. వివేకానందరెడ్డి గారి జయంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్నాను" అని నారా లోకేష్ పేర్కొన్నారు.

# సీబీఐ దర్యాప్తుపై ఎలాంటి కామెంట్ చేయను: సునీత



పులివెందుల: మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ తన పని తాను చేసుకుంటూ వెళ్తోందని ఆయన కుమార్తె నర్రెడ్డి సునీత అన్నారు. వివేకా జయంతి సందర్భంగా కడప జిల్లా పులివెందులలో ఆయన సమాధి వద్ద సునీత, ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డి, కుటుంబసభ్యులు నివాళులర్పించారు.

అనంతరం సునీత మీడియాతో మాట్లాడారు. సీబీఐ దర్యాప్తుపై ఎలాంటి కామెంట్ చేయనని సునీత చెప్పారు. పాఠశాలలో చదువుకునే రోజుల్లో తన గురించి కొందరు మాట్లాడుకునే విషయాలను తండ్రి దృష్టికి తీసుకెళ్లానని ఆమె గుర్తుచేసుకున్నారు. పొగడ్తలను పట్టించుకోవద్దని.. తప్పును వేలెత్తి చూపించే అంశాలపై దృష్టిపెట్టాలని అప్పట్లో ఆయన సూచించారని సునీత వివరించారు.




బాబీ దర్శకత్వంలో చిరంజీవి నటించిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. ఈ సినిమా కొన్ని థియేటర్లలో 200 రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా చిత్రబృందమంతా వేడుక చేసుకుంది. ఇందులో చిరంజీవి మాట్లాడుతూ రాజకీయాలపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. గతకొన్నేళ్లుగా సినీ పరిశ్రమను చుట్టుముడుతున్న కొన్ని రాజకీయాంశాలపై చిరంజీవి మాట్లాడారు.

"మీలాంటి వాళ్లు ప్రత్యేక హోదా గురించి, రోడ్ల నిర్మాణం, ప్రాజెక్టులు, ఉద్యోగ-ఉపాధి అవకాశాల గురించి ఆలోచించాలి. పేదవారి కడుపునింపే దిశగా ఆలోచించాలి. అలా చేస్తే అందరూ మీకు తలవంచి నమస్కరిస్తారు. అంతేగానీ, పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం లాగా సినీ పరిశ్రమపై పడతారేంటి.." అని చురకలు అంటించారు. అలాగే వాల్తేరు వీరయ్య చిత్ర విజయం తనకెంతో సంతోషాన్నిచ్చిందన్నారు. "ఒకప్పుడు.. సినిమాలు 100, 175, 200 రోజులు ఆడేవి. ఇప్పుడు.. రెండు వారాలే ఆడుతున్నాయి.

ఇలాంటి నేపథ్యంలో 'వాల్తేరు వీరయ్య' 200 రోజులు ప్రదర్శిచడం ఆనందంగా ఉంది. అత్యధిక రోజులు సినిమా ప్రదర్శితమై, విజయానికి గుర్తుగా షీల్డు అందుకున్నందుకు ఒళ్లు పులకరిస్తోంది. చరిత్రను తిరగరాసినట్టు అనిపిస్తోంది" అని అన్నారు.




# చిరు వ్యాఖ్యలపై బొత్స కౌంటర్

విజయవాడ: సినీ పరిశ్రమ ఒక పిచ్చుక అని అంగీకరించారా? చిరంజీవి చెప్పాలని ఏపీ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. చిరంజీవి నటించిన చిత్రం 'వాల్తేరు వీరయ్య' ఈ సినిమా కొన్ని థియేటర్లలో 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మాట్లాడిన చిరంజీవి.. తాజా రాజకీయాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన మంత్రి బొత్స సత్యనారాయణ.. చిరంజీవి వ్యాఖ్యలపై స్పందించారు. "ఏపీలో సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయి. చిరంజీవి ఎందుకు వ్యాఖ్యలు చేశారో చెప్పాలి. ప్రతి సమస్యపై ప్రభుత్వం స్పందిస్తుంది. చిరంజీవి వ్యాఖ్యలు చూశాక పూర్తి స్థాయిలో స్పందిస్తాను. మేం వారాహి యాత్రను అడ్డుకోం. యాత్రల పేరుతో చట్టాలను చేతుల్లోకి తీసుకుంటే మాత్రం ఊరుకోం. ప్రజాస్వామ్యంలో యాత్రలు ఎవరైనా చేసుకోవచ్చు. విశాఖలో పవన్ వారాహి యాత్రపై దేశమంతా చర్చ జరుగుతుందంటున్నారు. చంద్రబాబు పుంగనూరు యాత్ర మాదిరిగా విధ్వంసం చేయాలని చూస్తున్నారా?" అని బొత్స ప్రశ్నించారు.

# 2025 నాటికి జగన్ సీఎంగా ఉంటారా?.. పోలవరంపై రామకృష్ణ



తిరుపతి: పోలవరం ప్రాజెక్ట్‌కు సంబంధించి సీఎం జగన్ మోహన్ రెడ్డిపై సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మరోసారి విరుచుకుపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... పోలవరం నిర్వాసితులకు రూ.10 లక్షలు ఇస్తానన్నారని.. ఇప్పుడు పోలవరం జాతీయ ప్రాజెక్టు అంటున్నారన్నారు. 2020, 2021, 2022 అంటూ గడువులు పెంచారని.. ఇప్పుడు 2025కు పోలవరం పూర్తి చేస్తాం అంటున్నారని మండిపడ్డారు. 2025 నాటికి జగన్మోహన్ రెడ్డి సీఎంగా ఉంటారా అని ఎద్దేవా చేశారు. నిర్వాసితులను నీళ్లలో ముంచి ఈరోజు మాట మారుస్తున్నారని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి సీఎంగా ఉండగా పోలవరం పూర్తి కాదని స్పష్టం చేశారు. 150 అడుగుల ఎత్తు ఉండాలని... వైఎస్ రాజశేఖర్ రెడ్డి, చంద్రబాబు ప్రాజెక్టు ఎత్తు తగ్గించే ఆలోచన చేయలేదన్నారు. కానీ జగన్మోహన్ రెడ్డి మాత్రం పోలవరం ఎత్తు తగ్గించారని మండిపడ్డారు. అమరావతిని ధ్వంసం చేసినట్లే పోలవరంను జగన్ నాశనం చేస్తున్నారని విమర్శించారు. 23న ఏలూరులో పోలవరంపై నిరసన చేపడతామని ప్రకటించారు. మెడికల్ కాలేజీ సీట్లలో ప్రభుత్వం నిర్ణయంతో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు పూర్తి నష్టం వాటిల్లుతుందన్నారు.

ప్రభుత్వ మెడికల్ కాలేజీ సీట్లకే గండి కొడుతుంటే ప్రైవేటు కాలేజీల పరిస్థితి ఘోరమని రామకృష్ణ వ్యాఖ్యలు చేశారు.

# ఎంపిక చేసిన వారే మాట్లాడాలట... జగన్ రాకతో కోనసీమ అష్టదిగ్బంధనం



కోనసీమ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా అంబేద్కర్ కోనసీమ జిల్లా అష్టదిగ్బంధనంలోకి వెళ్లిపోయింది. కోనసీమలో ఎక్కడికక్కడ వందల సంఖ్యలో పోలీసులు మోహరించారు. వరద బాధితులు ఎవరూ జగనన్నను కలవకుండా పోలీసులు కట్టుదిట్టంగా బందోబస్తు ఏర్పాటు చేశారు. జగన్ పర్యటించే ప్రాంతానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఎవ్వరూ లోపలికి వెళ్ళకుండా పోలీసు వలయంలా మారిపోయింది. జగన్‌కు బాధితుల సమస్యలు వినిపించకుండా ఉండేందుకు ఎంపిక చేసిన వారితో మాత్రమే ముఖాముఖి నిర్వహించేలా వైసీపీ వర్గాలు, ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాటు చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

# గురజాలలో దుమ్మురేపుతోన్న లోకేశ్ యువగళం...



పల్నాడు: గురజాల నియోజకవర్గంలో టీడీపీ యువనేత నారా లోకేశ్ యువగళం పాదయాత్ర దుమ్మురేపుతోంది. మంగళవారం ఉదయం జూలకల్లు నుంచి 178వ రోజు పాదయాత్రను యువనేత ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే యరపతినేని నేతృత్వంలో పాదయాత్ర హోరెత్తుతోంది. గురుజాల నియోజకవర్గంలో రకారకాల కళాకారులతో లోకేశ్‌కు స్వాగతం పలికారు. 101 కలశాలతో మహిళలు లోకేశ్‌ను స్వాగతించారు. అలాగే వేదపండితులు ఆశీర్వచనం అందించారు. సాంప్రదాయ డప్పులు, థింసా నృత్యాలు, కేరళ వాయిద్యాలు, ఒంటెలు, అశ్వాలతో యువనేతకు అపూర్వస్వాగతం పలికారు. బాణాసంచా మోతలు, పార్టీ కార్యకర్తల కేరింతల నడుమ పాదయాత్ర కొనసాగుతోంది. దారిపొడవునా లోకేశ్‌కు మహిళలు హారతులిస్తూ నీరాజనాలు పలుకుతున్నారు. ధరల పెరుగుదల, అరాచకపాలనతో అవస్థలు పడుతున్నామని యువనేతకు గురజాల ప్రజల ఆవేదన వెలిబుచ్చారు. మరికొద్దినెలల్లో రాబోయే చంద్రన్న ప్రభుత్వం అందరి కష్టాలు తీరుస్తుందని భరోసా ఇస్తూ లోకేశ్ ముందుకు సాగుతున్నారు.

## ట్రాన్సపరెంట్ చీరలో బ్రో బ్యూటీ సెగలు..!

ఒకే ఒక్క వీడియోతో నేషనల్ క్రష్ గా మారిన బ్యూటీ ప్రియా ప్రకాశ్ వారియర్. జస్ట్ ఒక్క కన్ను కొట్టి, కుర్రాళ్ల మనసు దోచేసింది. ఆ తర్వాత వెంటనే ఈ బ్యూటీకి ఆఫర్లు క్యూ కట్టాయి. కానీ, ఏవీ పెద్దగా క్లిక్ కాకపోవడంతో, క్రేజ్ కేవలం సోషల్ మీడియాకే పరిమితమైంది. అయితే తాను చేసిన తప్పులను తెలుసుకున్న ప్రియా వారియర్, ఇప్పటి నుంచి కథల ఎంపిక విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం మొదలుపెట్టింది. ఈ క్రమంలోనే ఇటీవల పవన్ కళ్యాణ్ బ్రో మూవీలో ఛాన్స్ కొట్టేసింది. ఈ మూవీలో ప్రియా వారియర్ పాత్ర నిడివి తక్కువ అయినప్పటికీ, నటనకు మంచి మార్కులేపడ్డాయి. ఇక మూవీ కూడా విజయం సాధించడంతో, ఆమెకు ఆఫర్లు పెరిగే అవకాశం ఉందని ఫ్యాన్స్ భావిస్తున్నారు. సినిమాల మాట ఎటు ఉ



న్నా, సోషల్ మీడియాలో మాత్రం ఎప్పటికప్పుడు సందడి చేస్తూ ఉంటుంది. తాజాగా తెలుపు రంగు చీరలో చందమామలా మెరిసిపోయింది. టాన్స్పరెంట్ తెలుగు రంగు చీరకి, మ్యాచింగ్ బ్లౌజ్ ధరించింది. ఆ డిజైనర్ బ్లౌజ్ లో తన ఎద అందాలు స్పష్టంగా కనిపించేలా ఫోటోలకు ఫోజులు ఇచ్చింది. ఇప్పుడు ఈ అందాలకు అందరూ ఫిదా అయిపోతున్నారు. ఏమి ఆ అందం బ్రో అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఇప్పుడంటే చీరలో అందాలు ఆరబోసింది కానీ, మామూలుగా అయితే ఎక్కువగా ట్రెండీ దుస్తుల్లోనే మెరుస్తూ ఉంటుంది. ఇటీవల బీచ్ లో బికినీ వేసుకొని తన స్నేహితులతో కలిసి ఫుల్ రచ్చ చేసింది. ఆ ఫోటోలు కూడా తెగ వైరల్ అయ్యాయి. ఇక ప్రియా వారియర్ బ్రో కంటే ముందు తెలుగులో రెండు చిత్రాల్లో నటించింది. ముందు నితిన్ సరసన 'చెక్' చిత్రంలో నటించింది. ఆ తర్వాత యంగ్ హీరో తేజ సజ్జ సరసన 'ఇష్క్ : నాట్ ఏ లవ్ స్టోరీ'లో నటించింది. అయితే ఈ రెండు చిత్రాలు ప్రియాకు సక్సెస్ ను అందించలేకపోయాయి. కాగా, తెలుగు, తమిళంలోనూ నటించింది.

## లెహంగాలో క్లీవేజ్ ఫోజులతో కవ్విస్తున్న అలాయా..!

బాలీవుడ్ లో ఈ మధ్యకాలంలో వరస అవకాశాలు అందుకుంటోన్న బ్యూటీ అలాయా. ఈ బామ ఇండస్ట్రీలోకి ఇటీవలే అడుగుపెట్టింది. కానీ, అడుగుపెట్టి పెట్టగానే అందరినీ తన అందంతో ఆకర్షించడం మొదలుపెట్టింది. జవానీ జానేమన్ సినిమాతో అలాయా బాలీవుడ్ లో అడుగుపెట్టింది. మొదటి సినిమాలోనే ఆమె అందానికి అందరూ ఫిదా అయిపోయారు. ఆ తర్వాత ఆమెకు మరో, రెండు మూడు సినిమాల్లో ఛాన్సులు వచ్చాయి. కార్తీక్ ఆర్యన్ తో కలిసి ఫ్రెడ్డీ మూవీలో నటించింది. ఈ మూవీలో గ్లామర్ కూడా ఒలకబోసింది. లిప్ లాక్ సీన్లతో హీటు కూడా పెంచింది. కానీ ఈ మూవీ పెద్దగా క్లిక్ కాలేకపోయింది. కాగా, ఈ బ్యూటీ సోషల్ మీడియాలోనూ చాలా చురుకుగా ఉంటుంది. ఎప్పటికప్పుడు తన



అందాలను సోషల్ మీడియాలో ఆరబోస్తూ ఉంటుంది. తాజాగా లెహంగాలో మెరిసింది. క్లీవేజ్ షోతో హీటు పెంచేసింది. ఈ ఫోటోలు చూసి కుర్రాళ్ల మతిపోతోంది. హాట్, సూపర్ అంటూ ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ అలాయా పూర్తి పేరు అలాయా ఇబ్రహీం ఫర్నీచర్ వాలా. ఒకప్పటి అందాల తార పూజా బేడీ కుమార్తె ఈ అలాయా. కబీర్ బేడీకి మనవరాలు. ముంబయిలోని జమ్నాబాయి నర్సీ స్కూల్ లో చదువుకుంది. సినిమాల్లో ఎంట్రీ ఇవ్వక ముందే న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీలో యాక్టింగ్ మొదలుపెట్టింది. ఆ తర్వాతే తన పేరును అలాయా ఎఫ్ గా మార్చుకుంది. కాగా, ఈమె తన మొదటి సినిమాలోనే గర్భిణీ గా నటించి అందరికీ షాకిచ్చింది, ఇక ఫ్రెడ్డీ మూవీలో సైతం హీరోని మోసం చేసే పాత్రలో నటించింది. గ్లామర్ గా కనిపిస్తూనే, నటకు ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకుంటూ ముందుకు దూసుకుపోతోంది. మొదటి సినిమాలోనే తన నటనకు ఫిల్మ్ ఫేర్ అవార్డు అందుకోవడం విశేషం. అలాయాకు ఇన్ స్టాగ్రామ్ లో 1.3 మిలియన్ ఫాలోవర్స్ ఉన్నారు. ఈ ఏడాది ఆమె యూటర్న్ అనే మూవీ తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇది సమంత చేసిన యూటర్న్ కి రీమేక్ కావడం విశేషం.





## బోల్డ్ లుక్స్ తో కవ్విస్తున్న బిగ్ బాస్ బ్యూటీ



బుల్లితెర ముద్దుగుమ్మ అరియానా తెలియనివారు ఎవరూ ఉండరేమో. ఒకప్పుడు గుర్తింపు చాలా తాపత్రయపడిన ఈ బ్యూటీ ఇప్పుడు ఫుల్ ఫేమస్ అయిపోయింది. ఓ ఛానెల్ లో యాంకరింగ్ తో తన కెరీర్ ని మొదలుపెట్టిన ఆమె, ఆర్జీవీ ఇంటర్వ్యూతో ఒక్కసారిగా అందరి ఫోకస్ సంపాదించుకుంది. దానితోనే బిగ్ బాస్ లోకి అడుగుపెట్టగలిగింది. ఇక బిగ్ బాస్ లోనూ తనదైన శైలిలో గేమ్స్ ఆడుతూ, ఎక్కువ మంది ఫ్యాన్స్ ని సంపాదించుకుంది. ఇక, గ్లామర్ షో చేయడంలోనూ ఏమాత్రం మొహమాటపడదు. బిగ్ బాస్ లోనూ క్లీవేజ్ షో తో ఆకట్టుకుంటూ ముందుకు సాగింది. కాగా, ఈ బ్యూటీ సోషల్ మీడియాలోనూ చాలా యాక్టివ్ గా ఉంటుంది. ఎప్పటికప్పుడు తన ఫోటోలు షేర్ చేసి మెస్మరైజ్ చేస్తూ ఉంటుంది. తాజాగా ఆరెంజ్ కలర్ డ్రెస్ లో క్లీవేజ్ సోగసులు వెదజల్లింది. ఆరెంజ్ కలర్ స్లీవ్ లెస్ డ్రెస్ లో ఫోటోలకు ఫోజులు ఇచ్చింది. ఈ అదిరిపోయే అవుట్ ఫిట్ లో తన అందాలు మొత్తం చూపిస్తూ.. తన ఫ్యాషన్ సెన్స్ తో కుర్రాళ్ల మతులు పోగొడుతోంది. ఇప్పుడు ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. కాగా, బిగ్ బాస్ సీజన్ 4 తర్వాత ఈ బ్యూటీ చాలా బిజీగా మారింది. ఆ మధ్య ఓ వెబ్ సిరీస్ లోనూ నటించింది. ఆ తర్వాత మళ్లీ బిగ్ బాస్ ఓటీటీ షో ద్వారా అదరగొట్టింది. మధ్యలో అదే బిగ్ బాస్ లో యాంకరింగ్ చేసింది. మొన్నటి వరకు స్టార్ మాలో ఏదో ఒక ప్రోగ్రామ్ తో బిజీగా గడుపింది. ఇటీవల బీబీ జోడి తో తనలోని డ్యాన్సర్ ని కూడా బయటకు తీసింది. ఆ షో లో ఆమె రన్నర్ గా నిలడం విశేషం. ఇక, మళ్లీ బిగ్ బాస్ 7 మొదలవౌతుండటంతో, మళ్లీ అలియానా సందడి చేయడం గ్యారెంటీ అని తెలుస్తోంది. ఈ బ్యూటీకి గ్లామర్ విషయంలో ఎలాంటి మొహమాటం లేదు. మరి ఆమె అందాన్ని దర్శక నిర్మాతలు గుర్తిస్తే, వెండితెరపై మెరవడం ఖాయం.

## వృద్ధుల ముద్దు సీన్ తో రూ.100 కోట్లు!



రణ్వీర్ సింగ్, ఆలియా భట్ హీరో హీరోయిన్ గా కరణ్ జోహార్ దర్శకత్వంలో రూపొంది ఇటీవల వచ్చిన చిత్రం 'రాకీ ఔర్ రాణీకి ప్రేమ్ కహానీ'. చాలా సంవత్సరాల తర్వాత కరణ్ జోహార్ దర్శకత్వంలో రూపొందిన సినిమా అవ్వడంతో విడుదల కు ముందు భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రముఖ నటీనటులు ఈ సినిమా లో నటించడం వల్ల మంచి బజ్ క్రియేట్ అయ్యింది. ఓపెనింగ్ వసూళ్లు కూడా భారీగా నమోదు అయ్యాయి. తాజాగా ఈ సినిమా వంద కోట్ల మార్క్ ను కూడా క్రాస్ చేసింది అంటూ బాలీవుడ్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఈ మధ్య కాలం లో హిందీ సినిమాలు వంద కోట్లు రాబట్టడం గొప్ప విషయంగా మారింది. రాకీ ఔర్ రాణికి ప్రేమ్ కహానీ సినిమా వంద కోట్ల వసూళ్లలో ధర్మేంద్ర మరియు షబానా అజ్మీ ల యొక్క ముద్దు సీన్ కీలక పాత్ర పోషించింది అంటూ సోషల్ మీడియాలో టాక్ వినిపిస్తుంది. ఈ వయసులో ఇద్దరు కూడా ముద్దు సన్నివేశం కు ఓకే చెప్పడం విడ్డూరంగా ఉందంటూ కొందరు కామెంట్స్ చేస్తే మరి కొందరు మాత్రం ఆ సన్నివేశం పట్ల ఆసక్తి చూపించారు. మొత్తానికి ఈ సినిమా లోని వృద్ధుల ముద్దు సన్నివేశంతో పాటు జయా బచ్చన్, ధర్మేంద్ర, షబానా అజ్మీ వంటి ఆ తరం స్టార్స్ ఉడటం వల్ల సినిమాకు మంచి బజ్ క్రియేట్ అయింది. ఆ బజ్ కి తగ్గట్లుగా వసూళ్లు నమోదు అవ్వలేదు. కానీ ఒక మోస్తరులో అయితే వసూళ్లు దక్కాయి. కరోనా కు ముందు ఇలాంటి సినిమా వచ్చి ఉంటే రూ.250 కోట్ల వసూళ్లు నమోదు అయ్యి ఉండేవి అంటూ కొందరు బాలీవుడ్ బాక్సాఫీస్ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇక కరణ్ జోహార్ తాజా ఇంటర్వ్యూలో వృద్ధుల ముద్దు సన్నివేశం గురించి మాట్లాడుతూ.. ధర్మేంద్ర, షబానా అజ్మీ ఇద్దరికి ఎలాంటి సమస్యలేనప్పుడు ముద్దు సన్నివేశం విషయం లో ఇతరులకు ఏంటి సమస్య అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

## ఆ ఇద్దరి బయోపిక్స్ కోసం శ్రద్ధాకపూర్!

బాలీవుడ్ లో బయోపిక్ ల క్రేజ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. జీవిత కథలు అక్కడి మేకర్స్ తెరకెక్కించి నంతా గొప్పగా మరే మేకర్స్ తెరకెక్కించలేరు అనడంలో అతిశయోక్తి లేదు. సౌత్ మేకర్స్ కొన్ని ప్రయత్నా లు చేసినప్పటికీ బాలీవుడ్ అంతా ఫీల్ తీసుకురాలేకపోయాయి. అందుకే బయోపిక్ లకు బాలీవుడ్ పెట్టింది పేరుగా చెప్పుంకుంటాం. అక్కడ బయోపిక్ తెరకెక్కిస్తే బాక్సాఫీస్ షేక్ అవ్వాల్సిందే. అందుకే నటీనటులంతా జీవిత కథల్లో నటించడానికి ఎక్కువగా ఆసక్తి చూపిస్తుంటారు. జాన్వీకపూర్ ...సారా అలీఖాన్ లాంటి యంగ్ హీరోయిన్లు కూడా బయోపిక్స్ అంటే ఎంతో ఆసక్తి చూపిస్తుంటారు. తాజాగా వీళ్లిద్దరికంటే సీనియర్ బ్యూటీ అయిన శ్రద్ధాకపూర్ కూడా బయోపిక్ లపై మనసు పారేసుకుంది. ఇటీవల



జరిగిన ఓ ఈవెంట్ లో బయోపిక్స్ ప్రస్తావన రాగా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఎవరి జీవిత కథల్లో నటించాలని ఉంది? అని ప్రశ్నించగా... మా బంధువు పద్మిని కొల్హాపురే.. గాయకురాలు లతా మంగేష్కర్ జీవిత కథల్లో నటించాలని ఉంది. అది నాకు ఎప్పటి నుంచో ఉన్న కోరిక. అదొక లక్ష్యంగా మారిపోయింది. కానీ దాన్ని అందుకుంటానో లేదో తెలియదు. కానీ ఆ ఇద్దరు వ్యక్తులు ఎంతో గొప్పవారు. వాళ్ల జీవితాల్లో ఎన్నో సవాళ్లున్నాయి. వాళ్ల జీవితాల్లో ప్రతీ దశ ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. అలాంటి వ్యక్తుల జీవితాల్లో నటించాలంటే అదృష్టం కూడా కలిసి రావాలి. వ్యక్తిగతంగా వాళ్లు సాధించిన లక్ష్యాలు ఎన్నో ఉన్నాయి. అలాంటి వారి జీవితాల్లో నటిస్తే నాలాంటి నటీమణుల జీవితానికి సార్ధకథ దక్కుతుంది– అని అన్నారు. మరి బాలీవుడ్ మేకర్స్ ఆ దిశగా ప్రయత్నాలు చేస్తారేమో చూడాలి. లతా మంగేష్కర్ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉన్న గొప్ప గాయని. ఆమె జీవిత కథ ని తెరకెక్కించాలని చాలా మంది మేకర్స్ ప్రయత్నాలు చేస్తున్నారు.ఆ పాత్ర కోసం పేరున్న నటిని దించాలన్నది ప్లాన్. మరి ఆ లిస్ట్ లో శ్రద్ధా కపూర్ ఉందా? అన్నది చూడాలి. ప్రస్తుతం శద్రా కపూర్ –స్త్రీ– 2 –లో నటిస్తోన్న సంగతి తెలిసిందే.

## 'సీతారామం' బ్యూటీ డబుల్ ధమాకా

హిందీ సీరియల్స్ మరియు సినిమాలతో ఉత్తరాది ప్రేక్షకులను సుదీర్ఘ కాలంగా ఎంటర్టైన్ చేస్తున్న ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్ టాలీవుడ్ లో 'సీతారామం' సినిమా తో ఎంట్రీ ఇచ్చిన విషయం తెల్సిందే. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందిన సీతారామం సినిమాలో దుల్కర్ సల్మాన్ కి జోడీగా ఈ అమ్మడు హీరోయిన్ గా నటించి భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. సీతారామం తర్వాత తెలుగు లో వరుసగా ఈ అమ్మడికి ఆఫర్లు వచ్చాయి. కానీ ఈమె మాత్రం ఇప్పటి వరకు విజయ్ దేవరకొండ సినిమాతో పాటు నాని సినిమాలను మాత్రమే చేస్తోంది. ఆ రెండు సినిమాల తర్వాత ఈ అమ్మడికి టాలీవుడ్ లో స్టార్ హీరోలకు జోడీగా నటించే అవకాశాలు వస్తాయని ఇండస్ట్రీ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. టాలీవుడ్ విషయం పక్కన పెడితే తాజాగా ఈ అమ్మడు కోలీవుడ్



నుండి బిగ్ ఛాన్స్ ని దక్కించుకుంది. ట్యాలెంటెడ్ హీరో శివ కార్తికేయన్ తాజా చిత్రంలో ఈమెను హీరోయిన్ గా ఎంపిక చేశారని తెలుస్తోంది. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో రూపొందుతున్న శివ కార్తికేయన్ సినిమా ప్రారంభానికి ముందే మంచి బజ్ ను కలిగి ఉంది. ఈ సినిమా కోసం చాలా మంది హీరోయిన్స్ ను యూనిట్ సభ్యులు పరిశీలించారు. చివరకు మృణాల్ ఠాకూర్ ను ఎంపిక చేశారని తెలుస్తోంది. నటనకు ఆస్కారం ఉన్న పాత్ర అవ్వడం వల్ల ఈ అమ్మడిని ఎంపిక చేశారు అంటూ వార్తలు వస్తున్నాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కోలీవుడ్ లో ఎంట్రీ ఇవ్వబోతున్న ఈ అమ్మడు తాజాగా అరుదైన అవార్డు ను సొంతం చేసుకుంది. ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్బోర్న్ లో డైవర్సిటీ ఆఫ్ సినిమా అనే అవార్డుకు మృణాల్ ఠాకూర్ ఎంపిక అయింది. ఈ ప్రతిష్టాత్మక అవార్డు ను వచ్చే వారంలో మృణాల్ అందుకోబోతుంది. ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్బోర్న్ లో డైవర్సిటీ ఇన్ సినిమా అవార్డును సొంతం చేసుకోవడం పట్ల చాలా సంతోషంగా ఉందని.. అదే సమయంలో గౌరవం గా ఉందని మృణాల్ ఆనందం వ్యక్తం చేసింది. కోలీవుడ్ లో ఒక క్రేజీ ప్రాజెక్ట్ లో నటించే అవకాశం రావడంతో పాటు ఇలా ప్రతిష్టాత్మక అవార్డు కి ఎంపిక అవ్వడం పట్ల ఆమె అభిమానులు డబుల్ ధమాకా అంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో అభిమానులు తెగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.




# రాహుల్ గాంధీకి మళ్లీ అదే బంగళా కేటాయింపు

న్యూఢిల్లీ: లోక్‌సభ సభ్యత్వం పునరుద్ధరణ జరగడంతో రాహుల్ గాంధీకి ఢిల్లీలో అధికారిక బంగళాను ప్రభుత్వం తిరిగి కేటాయించింది. గతంలో ఆయన నివసించిన 12, తుగ్లక్ లేన్ బంగళాను తిరిగి ఆయనకు ఇవ్వాలని లోక్‌సభ హౌస్ కమిటీ నిర్ణయించుకుంది. పరువునష్టం కేసులో పార్లమెంటు సభ్యత్వాన్ని రాహుల్ ఇటీవల కోల్పోవడంతో నిబంధనల ప్రకారం గత ఏప్రిల్ 22న రాహుల్ తన అధికారిక బంగళాను ఖాళీ చేశారు. ఆ వెంటనే తన తల్లి సోనియాగాంధీ 10 జనపథ్ రెసిడెన్స్‌లో ఆమెతో పాటే ఉంటున్నారు. రాహుల్‌కు తమ ఇంట్లో నివాసం కల్పించేందుకు పలువురు పార్టీ నేతలు ముందుకు వచ్చారు. తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన 'స్టే'తో రాహుల్‌పై పడిన అనర్హత వేటును లోక్‌సభ సెక్రటేరియట్ పునరుద్ధరించింది. దీంతో ఆయనకు ఇంతకుముందు కేటాయించిన బంగ్లానే తిరిగి లోక్‌సభ హౌస్ కమిటీ కేటాయించింది. **భారత్ మొత్తం నా ఇల్లే..** ఎంపీగా అధికారిక నివాసాన్ని తిరిగి పొందడంపై రాహుల్ మీడియా ముందు స్పందించారు. యావత్ దేశం తన ఇల్లేనని చెప్పారు. రాహుల్ గాంధీ 12, తుగ్లక్ లేన్ బంగళాలో 2005 నుంచి గత ఏప్రియల్ వరకూ ఉన్నారు.

# 50 ఏళ్లు అధికారం ఇచ్చినా ఏమీ చేయని వారిని పట్టించుకోవద్దు: కేటీఆర్




సిరిసిల్ల: బీసీ బంధు పథకం కొంతమందికే పరిమితం కాదని.. రాష్ట్రంలో ఉన్న అర్హులందరికీ ప్రభుత్వ సాయం అందుతుందని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మంగళవారం బీసీ బంధు పథకం కింద 600 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. బీసీ బంధు కింద ఇచ్చే ఆర్థిక సాయం మళ్లీ తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. చెక్కుల పంపిణీ అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ మాట్లాడారు. "కేసీఆర్ ప్రభుత్వం.. పేదల ప్రభుత్వం. మనసున్న ప్రభుత్వం ఉంటేనే ప్రజలకు మంచి చేసే ఆలోచనలు వస్తాయి. ఇలాంటి ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉంది. వేములవాడ మున్సిపాలిటీ పరిధిలో అర్హులకు 800 పట్టాలు అందిస్తున్నాం. దాంతో పాటు సొంత స్థలం ఉన్న వారికి గృహలక్ష్మి పథకం కింద ఒక్కొక్కరికి రూ. 3లక్షలు ఇస్తున్నాం. ప్రతి నియోజకవర్గానికి 3వేల మంది చొప్పున అర్హులను ఎంపిక చేస్తాం. వారందరికీ న్యాయం చేస్తాం. 50 ఏళ్లు అధికారం ఇచ్చినా ఏమీ చేయని వారి మాటలు పట్టించుకోవద్దు. వాళ్లు ఏం చేసినా మేం పట్టించుకోవాలనుకోవడం లేదు. అయితే, వారు మీ దగ్గరకు వస్తే ఒకటే అడగండి. ఇవాళ మాట్లాడుతున్న మీరు.. మీ హయాంలో రూ. 200 మాత్రమే పింఛను ఎందుకిచ్చారని ప్రశ్నించండి. నీరెందుకు ఇవ్వలేదని నిలదీయండి. ప్రజలు చైతన్యం ప్రదర్శించాలి. పని చేసే ప్రభుత్వాలు, నాయకులను ప్రజలు కాపాడుకోవాలి.

ఎన్నికలు దగ్గర పడుతున్నాయి. ప్రజలు ఆగం కావొద్దు. నేను ఇంతవరకు మద్యం, డబ్బులు పంచలేదు. ఇకపై కూడా పంచను. మీ దయ ఉంటే మరోసారి గెలుస్తా. లేకపోతే ఇంట్లో కూర్చుంటా. ఇప్పుడు ఉన్న విధంగానే భవిష్యత్తులో కూడా ప్రజలకు సేవ చేస్తా. కులం, మతం అనే పిచ్చి లేకుండా అవసరమైన పని చేసే బాధ్యత నాది. అందరికీ అండగా ఉంటా" అని కేటీఆర్ అన్నారు.

# అసెంబ్లీ స్పీకర్ సహా కేసీఆర్, కేటీఆర్‌లపై పెద్ద ఎత్తున ఈటల ఫైర్..



హైదరాబాద్ : అసెంబ్లీ స్పీకర్ పై బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సెటైర్లు వేశారు. అసెంబ్లీ సమావేశాలు స్పీకర్ గొప్పగా నిర్వహించాడంటే.. దెయ్యాలు వేదాలు వల్లించినట్లేనన్నారు. బీజేపీ ఎమ్మెల్యేలకు కనీసం రూమ్ కూడా ఇవ్వకపోతే గన్ మెన్స్ రూమ్‌లో కూర్చొని నోట్స్ రాసుకున్నామన్నారు. సీఎం కేసీఆర్‌కు చట్ట సభల మీద విశ్వాసం సన్నగిలిందనడానికి నిదర్శనం ఇటీవల జరిగిన సమావేశాలేనన్నారు. ఒక సంవత్సరం లో అసెంబ్లీ సమావేశాలు జరిగింది కేవలం 14 రోజులేనని.. ఉమ్మడి రాష్ట్రంలో ఏడాదికి దాదాపు 50 నుంచి 65 రోజులు సమావేశాలు జరిగేవని ఈటల అన్నారు. "ఎమ్మెల్యేలను ప్రజలు ఎన్నుకుంది చట్టాలు చేసేందుకు.. కానీ ఎమ్మెల్యేలను విమర్శలు చేసే వారిని బెదిరించే వారిగా తయారు చేశారు. ఎన్ని రోజులు అయినా చర్చకు సిద్ధం అని చెప్పే ముఖ్యమంత్రి ఎందుకు ఇలా వ్యవహారిస్తున్నారు? ఉమ్మడి రాష్ట్రంలో13 పార్టీలు ఉన్న బీఏసీకి పిలిచేవారు. కానీ ఇప్పుడు అసెంబ్లీలో ఉంది కేవలం నాలుగు పార్టీలే.. అందులో బీజేపీ జాతీయ స్థాయిలో అధికారంలో ఉన్న పార్టీ. ఇలాంటి పార్టీని బీఏసీకి పిలవకపోవడం అంటే ఎంత అక్కసు ఉందో తెలుసుకోవచ్చు. బీజేపీకి అసెంబ్లీలో కనీసం రూమ్ కూడా ఇవ్వలేదు. మమ్మల్ని అవమాన పర్చడం కాదు.. స్పీకర్ మా హక్కులను కాపాడండి అని ఆడిగినం. శాసనసభలో ఎమ్మెల్యే కు కన్వెన్షన్ ఉంటాయి.. వాటిని ఎక్కడా స్పీకర్ పాటించలేదు.. అసెంబ్లీలో మేము ఏమైనా చెప్పాలి అనుకుంటే ఆయన కనీసం మా మొహం కూడా చూడడు. అసెంబ్లీలో కేవలం సీఎం వైపు మాత్రమే చూస్తూ మాకు సమయం కూడా ఇవ్వడు. బీఆర్ఎస్, ఎంఐఎం మిత్రులే అని సీఎం చెబుతాడు. మిత్ర పక్షమే అసెంబ్లీలో ప్రతిపక్షంగా వ్యహరించడం దారుణం. అసెంబ్లీలో ఎన్ని ప్రశ్నలు అడిగినా ప్రభుత్వం నుంచి సమాధానాలు రాలేదు. ఎంఐఎం అడిగితే మాత్రం లేచి లేచి సమాధానాలు చెప్పారు. వరదల్లో 41 మంది చనిపోతే అసెంబ్లీలో వారి ప్రస్తావనే లేదు.. కనీసం వారికి సంతాపం కూడా లేదు. వరదల్లో నష్టపోయిన రైతులకు కనీస సహాయం లేదు. ఏం చేయకపోయినా మళ్ళీ 105 సీట్ల తో గెలుస్తాం అని చెపుతున్నారంటే రైతుల పట్ల వారికి ఉన్న కన్సర్న్ ఏంటో తెలుస్తుంది. హరీష్ రావు మాట్లాడితే అన్నింటిలో తెలంగాణ నంబర్ 1. కేటీఆర్ మాట్లాడితే చప్పట్లు కొట్టే వారు 100 ఎమ్మెల్యేలు ఉన్నారు అని ర్యాగింగ్ చేయడమే. కాగ్ రిపోర్ట్ లో ప్రభుత్వం అనేక తప్పులను ఎత్తి చూపింది. బడ్జెట్ అలకేషన్స్ ఉన్నాయి కానీ రిలీజ్ చేసేది లేదని ఎత్తి చూపింది. పెట్టే బడ్జెట్ కొండంత.. ఖర్చు చేసేది గోరంత అని కాగ్ రిపోర్టు చెప్పింది. కానీ కేసీఆర్ మాత్రం నా అమ్ముల పొదిలో అనేక అస్త్రాలు ఉన్నాయి అంటున్నాడు. గతంలో ఇచ్చిన నిరుద్యోగ భృతి, రైతు రుణమాఫీ లాంటి హామీలే ఇప్పటికి అమలు కాలేదు." అని ఈటల పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌ను తిట్టడానికే శాసనసభ పెట్టినట్లుంది



ఢిల్లీ: గద్దర్ పాటలు తెలంగాణ ప్రజలను ఆలోచింప చేశాయని పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అన్నారు. ఢిల్లీలో రేవంత్ మీడియాతో మాట్లాడారు. "ప్రజా యుద్ధనౌక గద్దర్ మరణం తెలంగాణ ప్రజలను కన్నీటి దుఃఖంలో ముంచి వేసింది. దళితులకు, గిరిజనులకు ఎవరికి ఏ దుఃఖం ఉన్న ఆ దుఃఖం నాది అని గద్దర్ ప్రయాణం జరిగింది. గద్దర్ మృతి తెలిసి అన్ని పనులు మానుకుని భౌతికకాయం దగ్గరకు వెళ్లాం. గద్దర్ మరణం రాజకీయం కావొద్దు అని మాట్లాడలేదు. నిఘా అధికారులు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గద్దర్ మృతిని తెలియజేశారు. అసెంబ్లీలో గద్దర్‌పై చర్చ, నివాళి అర్పించి ఉంటే బాగుండు. అసెంబ్లీ సమావేశాల్లో వరదలు, విద్యార్థుల సమస్యలు, ఏ అంశంలపై చర్చ జరపలేదు. కాంగ్రెస్ పార్టీని కేసీఆర్ అతి తీవ్రంగా విమర్శించారు. కేసీఆర్, కేటీఆర్‌సభను మొత్తం నాపై తిప్పారు.

రేవంత్ రెడ్డిని దూషించడానికి, కాంగ్రెస్‌ను దోషిని చేసే ప్రయత్నం చేశారు. తండ్రి, కొడుకుల ముందు కొన్ని ప్రశ్నలు పెడుతున్నా. నేనూ, కేసీఆర్.. టీడీపీ నుంచి వచ్చిన వారమే. చంద్రబాబు సహచరుడిగా నా ప్రస్థానం టీడీపీలో కొనసాగింది. చంద్రబాబు అనుచరుడిగా కేసీఆర్ ప్రయాణంలో టీడీపీలో మొదలైంది. నిలువ నీడలేని కేసీఆర్‌కి టీడీపీ ఆసరా అయింది. నేను ఎమ్మెల్సీగా గెలిచి టీడీపీకి వెళ్లాను. జూబ్లీహిల్స్ లాంటి సొసైటీకి డైరెక్టర్‌గా అత్యంత పిన్న వయసులో ఎన్నికయ్యాను." అని ఆయన తెలిపారు.

# వీల్‌చైర్‌లో రాజ్యసభకు మన్మోహన్ సింగ్ రాక.. కాంగ్రెస్‌పై భాజపా విమర్శలు

దిల్లీ: దిల్లీ అధికారుల నియంత్రణ బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో భాగంగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సోమవారం రాజ్యసభకు వీల్‌ఛైర్‌లో వచ్చి, ఓటేశారు. దీనిపై విపక్ష నేతలు కృతజ్ఞతలు తెలియజేశారు. అయితే అనారోగ్యంతో ఉన్న ఆయన వచ్చి ఓటింగ్‌లో పాల్గొనడం.. భాజపా, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. సిగ్గుచేటు చర్య అంటూ కమలం పార్టీ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించింది. కీలక సమయంలో రాజ్యసభకు వచ్చిన మన్మోహన్ సింగ్‌కు ఆప్ ఎంపీ రాఘవ చద్దా కృతజ్ఞతలు తెలియజేశారు. 'మన్మోహన్ సింగ్ విలువలకు అసలైన అర్థం చాటిచెప్పారు. మరీ ముఖ్యంగా బ్లాక్ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా ఓటు వేసేందుకు వచ్చారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం పట్ల ఆయనకున్న నిబద్ధత అందరికీ స్ఫూర్తిదాయకం. కృతజ్ఞతలు సర్' అని ఆయన రాకపై చద్దా స్పందించారు. ఆయన హాజరు నేపథ్యంలో కాంగ్రెస్‌పై భాజపా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించింది. 'కాంగ్రెస్ తెలివితక్కువతనాన్ని దేశం మొత్తం గుర్తుంచుకుంటుంది. ఆరోగ్యం సరిగాలేని మాజీ ప్రధానిని కాంగ్రెస్ రాత్రి పూట పార్లమెంట్‌లో కూర్చోబెట్టింది. నిజాయతీలేని ఓ కూటమిని బతికించుకోవడం కోసం ఈ విధంగా ప్రవర్తించింది. ఇంతకంటే సిగ్గుచేటు చర్య ఉంటుందా..?' అని మండిపడింది. ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్ నేత సుప్రియా శ్రీనతె తిప్పికొట్టారు. ఇది ప్రజాస్వామ్యంపై ఆయనకున్న విశ్వాసానికి నిదర్శమని అన్నారు. 90 ఏళ్ల మన్మోహన్ సింగ్‌తో పాటు ఝూర?ండ్ ముక్తి మోర్చా కురువృద్ధుడు శిబు సోరెన్ కూడా నిన్న సభకు వచ్చారు. ఆప్ తీవ్రంగా వ్యతిరేకించిన దిల్లీ అధికారుల నియంత్రణ బిల్లుకు నిన్న రాజ్యసభలో ఆమోదం లభించిన విషయం తెలిసిందే. దీనికి వ్యతిరేకంగా ఓటువేసేందుకే ఈ సీనియర్ నేతలు పార్లమెంట్‌కు హాజరయ్యారు.





# ఎవరు గెలిచినట్లు.. కేసీఆర్ హా? గవర్నర్ హా?

హైదరాబాద్ : తెలంగాణ వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు ముగిశాయి. నాలుగు రోజులు సాగిన అసెంబ్లీలో మొత్తం 8 బిల్లులు ఆమోదం పొందాయి. ఇందులో ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లు కూడా ఉంది. దీనికి కూడా సభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లు పాస్ అవడంతో ఇప్పుడు కేసీఆర్ పైచేయి సాధించారా? లేదా గవర్నర్ గెలిచారా? అనే చర్చ సాగుతోంది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తున్నామని, ఇకపై ఆర్టీసీ ఉద్యోగులు అందరూ ప్రభుత్వ ఉద్యోగులుగా మారుతారని కేసీఆర్ ప్రభుత్వ నిర్ణయాన్ని కేటీఆర్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిపై అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టారు. దీన్ని గవర్నర్ దగ్గరకు పంపించారు. ఆమె కొన్ని సందేహాలు లేవనెత్తుతూ వివరణ కోరడంతో ఉత్కంఠ రేగింది. మరోవైపు బిల్లును గవర్నర్ ఆమోదించాలంటూ ఆర్టీసీ కార్మికులూ ధర్నాకు దిగారు. గవర్నర్ ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానాలు పంపడం.. మరింత వివరణ కోరుతూ గవర్నర్ ఇంకొన్ని సందేహాలు లేవనెత్తడం కూడా తెలిసిందే. దీనిపై ప్రభుత్వం మళ్లీ జావాబిచ్చింది. ఇలా ఆర్టీసీ బిల్లుపై కేసీఆర్ వర్సెస్ గవర్నర్ అన్నట్లుగా పరిస్థితి మారింది.

ఇద్దరిలో ఎవరూ తగ్గలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 40 వేలకు పైగా ఆర్టీసీ కార్మికులతో పాటు వీళ్ల కుటుంబాల ఓట్లను తమవైపు తిప్పుకునే ప్రయత్నంలో కేసీఆర్ తొలి అడుగు వేశారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఈ బిల్లులోని లోపాలను బయట పెట్టడం ద్వారా.. కొన్ని విషయాలు వెలుగులోకి వచ్చేలా గవర్నర్ చేశారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తానికి ఒక బిల్లుతో ఇటు కేసీఆర్, అటు గవర్నర్ ఇద్దరూ తమ పంతం నెగ్గించుకున్నట్లయిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

# మళ్లీ సెంటిమెంట్‌ను రెచ్చగొడుతున్న తండ్రీకొడుకులు



హైదరాబాద్ : తెలంగాణలో ఎన్నికలు దగ్గపరడుతున్నాయి. రాష్ట్రంలో హ్యాట్రిక్ విజయంపై కన్నేసిన కేసీఆర్ అందుకు తగిన కసరత్తులు చేస్తున్నారు. ఓ వైపు హామీలిస్తూ.. మరోవైపు వరాలు కురిపిస్తూ.. ఇంకోవైపు ప్రత్యర్థి పార్టీలపై విమర్శలు చేస్తూ సాగుతున్నారు. ఈ సారి కూడా ఎలాగైనా అధికారం దక్కించుకోవాలన్నది కేసీఆర్ లక్ష్యం. ఆయన తనయుడు ఐటీ మంత్రి కేటీఆర్ కూడా తండ్రి లక్ష్యం కోసం పాటుపడుతున్నారు. ఇప్పుడు ఈ ఇద్దరు కలిసి మరోసారి తెలంగాణ సెంటిమెంట్‌ను రగిల్చి ఎన్నికల్లో ప్రయోజనం పొందాలని చూస్తున్నారని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 2014 ఎన్నికల్లోనూ ఉమ్మడి ఏపీలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ ప్రచారం చేసిన కేసీఆర్ గెలిచారు. 2018లోనూ మరోసారి తెలంగాణ సెంటిమెంట్ వాడుకున్నారనే అభిప్రాయాలున్నాయి. ఇప్పుడు మరోసారి ఎన్నికలు వస్తుండడంతో సెంటిమెంట్ ప్రధాన అస్త్రంగా బీఆర్ఎస్ ముందుకు సాగుతోందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. తాజాగా అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చివరి రోజు కేసీఆర్, కేటీఆర్ చేసిన వ్యాఖ్యలే అందుకు నిదర్శనమని అంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో బీఆర్ఎస్కు పోటీగా కాంగ్రెస్ కనిపిస్తోంది. అందుకే కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకుని కేసీఆర్, కేటీఆర్ తెలంగాణ సెంటిమెంట్‌ను మళ్లీ ముందుకు తీసుకువచ్చారని టాక్. ఉన్న తెలంగాణను ఊడగొట్టిందే కాంగ్రెస్ అని నెహ్రూను కేసీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ కారణంగానే తెలంగాణకు మొదట్లో నష్టం జరిగిందని అన్నారు. మరోవైపు శాసన మండలిలో తెలంగాణకు అన్యాయం చేశాయని కాంగ్రెస్, టీడీపీ, బీజేపీని మంత్రి కేటీఆర్ కడిగిపారేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబు, కిరణ్ కుమార్ రెడ్డి తెలంగాణను అవమానించారని కేటీఆర్ అన్నారు.

ఇక ఇప్పటికే బీఆర్ఎస్ మంత్రులు.. ఏపీలోని రోడ్లు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి, విద్యుత్.. ఇలా చాలా విషయాల్లో తెలంగాణతో పోల్చి చూస్తూ విమర్శలు చేస్తున్న సంగతి తెలిసిందే.

# ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వం: మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



హైదరాబాద్: ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ తోడ్పాటుతో రాష్ట్రంలోని పురాతన దేవాలయాలను పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. మెరుగైన సౌకర్యాలు, ఆన్‌లైన్ సేవలు కల్పించడంతో ఆలయాలకు వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. హైదరాబాద్ బల్కంపేట ఎల్లమ్మవారి ఆలయంలో భక్తుల సదుపాయం కోసం చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ.. పర్వదినాలలో అన్ని పుణ్యక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయన్నారు. అదేవిధంగా ఆలయాల అభివృద్ధికి రూపొందించిన ప్రణాళికను ప్రభుత్వం దశ లవారీగా అమలు చేస్తున్నదని చెప్పారు. ఆధ్యాత్మిక, ఆహ్లాదకరంగా ఉండేలా భక్తులకు అన్ని సౌకర్యాల కల్పనకు కృషి చేస్తోందని వెల్లడించారు. దాతల సహకారంతో రూ. 8 లక్షల వ్యయంతో ఎల్లమ్మ అమ్మవారి ఆలయ రాజగోపుర ద్వారానికి గల రాగి తొడుగులపై బంగారు పాలిష్ చేయించారు. అదేవిధంగా రూ. 3 లక్షల వ్యయంతో టేకుతో చేయించిన శ్రీ పోచమ్మ ఆలయ ద్వారాలకు రాగి రేకులతో కూడిన బంగారు పాలిష్, రూ. 2.75 లక్షల వ్యయంతో టికెట్ వెండింగ్ మెషిన్, రెండు 5 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన మినరల్ వాటర్ ప్లాంట్లను మంత్రులు ప్రారంభించారు.

# బీఆర్ఎస్, ఆమ్‌ఆద్మీ పార్టీలది మద్యం బంధం



న్యూఢిల్లీ: ఢిల్లీ ప్రజలకు ప్రత్యేక అవసరాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ ఆర్డినెన్స్ తీసుకొచ్చిందని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. మంగళవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్, ఆమ్ ఆద్మీ పార్టీల మధ్య మద్యం బంధం ఉందని, కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒక్కటేనని విమర్శించారు. ఆస్తులు, ఇతర అంశాలను తారుమారు చేయడానికి మాత్రమే ఆప్ పార్టీ ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తోందని, అవినీతి, కుంభకోణాలకు అడ్రస్ గల పార్టీ అని.. అలాంటి అవినీతి పార్టీకి బీఆర్ఎస్ ఎంపీలు మద్దతు తెలుపుతున్నారంటే తెలంగాణ ప్రజలు గుర్తించాలన్నారు. అవినీతి పార్టీలకు చెక్ పెట్టేందుకు ఒక ఉద్యమం చేపట్టబోతున్నామని లక్ష్మణ్ అన్నారు. అవినీతిలో కూరుకుపోయిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను రాజకీయంగా పుట్టగతులు లేకుండా చూడాల్సిన బాధ్యత తెలంగాణ ప్రజలపై ఉందన్నారు. మరోసారి అవిశ్వాస తీర్మానం తీసుకొచ్చారని, ఇండియా కూటమిలోనే ఒకరిపై ఒకరికి విశ్వాసం లేదని విమర్శించారు. మోదీ ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి పథకాలను చూడలేక ప్రతిపక్షాలు అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెట్టాయని దుయ్యబట్టారు. చర్చకు అన్ని రకాలుగా సిద్ధంగా ఉంటే సభ నుండి పారిపోతున్నారని, అమిత్ షా కూడా మణిపూర్ అంశంపై చర్చకు సిద్ధంగా ఉన్నారని చెప్తుంటే అవిశ్వాసం పెట్టారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన విధంగా బుద్ధి చెబుతారని ఎంపీ లక్ష్మణ్ అన్నారు.

# దిల్లీ బిల్లు ఆమోదం వేళ.. మంత్రుల శాఖలు మార్చిన కేజ్రీవాల్..!

దిల్లీ: దిల్లీలోని ఆప్ ప్రభుత్వం రాష్ట్ర మంత్రివర్గంలో అనూహ్య మార్పు చేసింది. మంత్రి సౌరభ్ భరద్వాజ్‌ను సేవలు, విజిలెన్స్ విభాగం బాధ్యతల నుంచి తప్పించి.. ఆ రెండు శాఖలను ఆతిశీకి అప్పగించింది. పార్లమెంట్‌లో దిల్లీ అధికారుల నియంత్రణ బిల్లుకు ఆమోదం లభించిన మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ఆప్‌లో కీలక నేతలుగా వ్యవహరించిన మనీశ్ సిసోదియా, సత్యేందర్ జైన్ జైలుకెళ్లడంతో కొద్దినెలల క్రితం ఆతిశీ, సౌరభ్ భరద్వాజ కేబినెట్‌లో కీలక శాఖల బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు సౌరభ్ ఆధ్వర్యంలోని ఈ శాఖల బాధ్యతలు కూడా ఆతిశీకి అప్పగించారు. ఈ మార్పుతో దిల్లీ ప్రభుత్వంలో ఉన్న ఒకే ఒక్క మహిళా మంత్రి వద్ద అత్యధికంగా 14 శాఖలు ఉన్నట్లైంది.

తాజా మార్పునకు సంబంధించిన ఫైల్‌ను ఆమోదం నిమిత్తం ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్.. లెఫ్టినెంట్ గవర్నర్‌కు పంపారని సమాచారం. రాజ్యసభలో దిల్లీ బిల్లుపై చర్చ జరుగుతోన్న సమయంలో సౌరభ్ భరద్వాజ్ చూస్తున్న శాఖలను ఉద్దేశించి కేంద్రమంత్రి అమిత్ షా తీవ్ర ఆరోపణలు చేశారు. అర్ధరాత్రి ఫైల్స్ అడుగుతారని, స్పెషల్ సెక్రటరీ(విజిలెన్స్)కి రిపోర్టు చేయొద్దని అధికారులకు చెప్తారంటూ విమర్శలు చేశారు. అలాగే సుప్రీంకోర్టు తీర్పు తర్వాత సర్వీస్ సెక్రటరీని బదిలీ చేశారని గుర్తు చేశారు. కేంద్రమంత్రి వ్యాఖ్యల నేపథ్యంలోనే ప్రస్తుత పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com